SAPTHAGIRI (TELUGU)
ILLUSTRATED MONTHLY
Volume: 52, Issue: 7
December-2021, Price Rs.5/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

డిసెంబరు 2021
వెల రూ.5/-
పుటలు-56



## తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారి బ్రహ్మోత్సవాలు

(30-11-2021 నుండి
08-12-2021 వరకు)




తిరుమల తిరుపతి దేవస్థానములు

# తిరుచానూరు

# శ్రీపద్మావతిఅమ్మవారి పుష్పయాగం

(09-12-2021)



# గీతాశ్లోకార్థసారం

**శ్లో : గాండీవం స్రంసతే హస్తాత్ త్వక్చైవ పరిదహ్యతే ।**
**న చ శక్నో మ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః ॥**

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం- 30వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** మే= నాయొక్క; గాండీవం= గాండీవము; హస్తాత్= హస్తమునుండి; స్రంసతే= జారుచున్నది; త్వక్చైవ= చర్మమును; పరిదహ్యతే= అంతట దహింపబడుచున్నది; మే= నాయొక్క; మనశ్చ= మనస్సును; భ్రమతీవ= భ్రమించుచున్నదానివలె ఉన్నది; అవస్థాతుం= రథంమీద ఉండుటకు; న చ శక్నోమి= సమర్థుడను గాను.

**భావం:** గాండీవం చేతినుండి జారిపోవుచున్నది. చర్మము దహింపబడుచున్నది. నా మనస్సు భ్రమించినట్లున్నది. రథంమీద ఉండుటకు శక్తిలేక ఉన్నాను.

---

## నీ మోముకన్న అపురూపమా...

గందము వూసేవేలె కమ్మని మేన ఈ
గందము నీ మేని తావికంటె  నెక్కుడా

అద్దము చూచేవేలె అప్పటప్పటికిని
అద్దము నీ మోము కంటె నపురూపమా
ఒద్దిక తామరవిరి నొత్తేవు కన్నులు నీ
గద్దరి కన్నుల కంటె కమలము ఘనమా

బంగారు వెట్టేవేలే పడఁతి నీ మెయి నిండా
బంగారు నీ తనుకాంతి ప్రతి వచ్చీనా
ఉంగరా లేఁటికినే ఒడికపు వేళ్ళ
వెంగలి మణులు నీ వేలి గోరఁ బోలునా

సవరమేఁటికినే జడియు నీ నెరులకు
సవరము నీ కొప్పు సరి వచ్చీనా
ఇవలఁ జవులు నీకు నేలె వేంకటపతి-
సవరని కెమ్మోవి చవికంటేనా

(సంపుటము - 05, సంకీర్తన - 02)





*అలమేలుమంగ స్వతస్సిద్ధంగా మహాసౌందర్యవతి. జగదేక సౌభాగ్యవతి. ఆమె దివ్యమంగళ శరీరంనుండి సువాసనలు వెదజల్లబడుతున్నాయి. ఆమె ముఖాన చెక్కిళ్లు అద్దాలకంటె అపురూపంగా ఉన్నాయి. ఆమె కన్నులు తామరల సౌకుమార్యాన్ని పరిహసిస్తున్నాయి. బంగారు ధగధగలను మించిన ఆమె శరీరకాంతిపై మరల ఆ బంగారు ఆభరణాలనే ధరించవలసిన అవసరం లేదు. నిగనిగలాడుతున్న ఆమె కేశపాశంపై సవరం ధరించవలసిన పనిలేదు. ఆమె సర్వాంగీణ సౌందర్యం వేంకటపతికే కైవశం.*

# బంగారుచీరలో బ్రహ్మాండనాయకి!!

బంగారు మానవనాగరికత వికాసానికి సంకేతం. మన సాంస్కృతిక వారసత్వానికి నిదర్శనం. బంగారమంటే మాటలుకాదు. సంస్కృతాంధ్ర భారతీయభాషల్లో బంగారానికి లెక్కలేనన్ని పదాలున్నాయి. అవి స్వర్ణం, సువర్ణం, హిరణ్యం, హేమం, కనకం, కాంచనం, కుందనం, అపరంజి, పసిడి మొదలైనవి.

బంగారునగలు అలంకరించుకోవడం మనకు అనాదిగా వస్తున్న ఆచారమే. తరాలతరబడి ఆ నగలను కాపాడుకోవడం కూడా వస్తున్న ఆచారమే. బంగారమంటే వల్లమాలిన మమకారం లేనిది ఎవరికి? మనం బంగారు భవితవ్యాన్నే కదా కోరుకుంటాం. పట్టిందల్లా బంగారం కావాలనే కదా కోరుకుంటాం. మన బిడ్డల్ని మనం బంగారుకొండలనే కదా లాలిస్తూ పిలుస్తుంటాం.



ధగధగలాడే బంగారాన్ని గురించిన వర్ణనలు వేదాల్లో, శాస్త్రాల్లో, పురాణాల్లో అడుగడుగునా కనిపిస్తాయి.

వేదవాఙ్మయంలోని హిరణ్యగర్భసూక్తం, ఆదిశంకరుల విరచిత కనకధారాస్తోత్రంవంటివి బంగారంతో భారతీయులకు గల అవినాభావ సంబంధానికి ఆనవాళ్లు.

పురాణాలు వర్ణించిన సురాసుర యక్ష కిన్నెర కింపురుష గంధర్వాదులు స్వర్ణాభరణభూషితులై విరాజిల్లేవారు. రావణుడు ఏలిన లంక అడుగడుగునా బంగారుకాంతులతో ధగధగలాడేదట. ఇంద్రుడి స్వర్గం, మహావిష్ణువు వైకుంఠం, కుబేరుడి అలకాపురి బంగారుమయంగానే ఉండేవట. లక్ష్మీదేవి సాక్షాత్తు బంగారానికి ప్రతిరూపం!

ఆ మహాలక్ష్మే సాక్షాత్తు అలమేలుమంగగా తిరుచానూరులో కొలువై ఉంది. ఈమె శ్రీనివాసుడు తపస్సు చేసినందువల్లే పద్మసరోవరంలో అవతరించింది. ఆ బంగారుపద్మం నాళంద్వారా పద్మంలోని కర్ణికమధ్యలో ఆవిర్భవించింది.

వజ్రవైడూర్యమరకత మాణిక్యాది సర్వాభరణాలతో, పూలమాలలతో అవతరించింది. ఈమె ఆవిర్భవించినప్పుడు ముక్కుకు రత్నాలముక్కెర, శిరస్సుపై నవరత్నాలకిరీటం, మెడలో కంఠాభరణాలు, చేతులకు గాజులు, కాళ్లకు కడియాలు, నడుముకు వడ్డాణంతో ఎంతో శోభాయమానంగా దివ్యకాంతులతో ఆవిర్భవించింది. అలాంటి జగన్మంగళ స్వరూపిణిని దర్శించినవారిదే మహద్భాగ్యం!

తిరుచానూరులో కొలువై ఉన్న అలవేలుమంగ తాయారుకు ప్రతిసంవత్సరం కార్తికమాసంలో జరిగే బ్రహ్మోత్సవాల చివరిరోజున ఆ తల్లి అవతరించిననాడు బంగారుచీరను ఎంతో శోభాయమానంగా అలంకరిస్తారు.

ఆ సమయంలో అమ్మవారిని దర్శించినవారికి సాక్షాత్తు వైకుంఠ శ్రీమహాలక్ష్మిని దర్శించినంత మహద్భాగ్యమని, ముక్తిపదప్రాప్తిని కల్గిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

“ఆనందనిలయం” అనే బంగారుమేడలో కొలువై ఉన్న బ్రహ్మాండనాయకునకు దీటుగా మేటిగా “శాంతినిలయం” అనే బంగారుమేడలో కొలువై, భక్తులను నిండుగా అనుగ్రహిస్తున్న బ్రహ్మాండనాయకిని కన్నులారా దర్శించుకుందాం! జీవితమంతా బంగారుపంటలు పండించుకుందాం!!

*ఓం శ్రియై నమః*

50 వసంతాల
1970-2020
తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక


# సప్తగిరి


సంపుటి : 52 డిసెంబరు, 2021 సంచిక : 07




వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన ।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥


గౌరవ సంపాదకులు
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు
డా॥ కె.రాధారమణ
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

సంపాదకులు
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకురాలు
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఏ., ఎం.ఇడి., ఎం.సి.జె., ఎల్.పి.టి.,

ముద్రాపకులు
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,



సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| బంగారుచీరలో బ్రహ్మాండనాయకి!! | | 04 |
| అంగరంగ వైభోగ ఉత్సవాల్లో... అలమేలుమంగ!! | శ్రీమతి ఎం.పద్మావతి | 07 |
| శ్రీమద్భగవద్గీత | విద్వాన్, డా॥ ఈ.జి.హేమంతకుమార్ | 12 |
| ఆరోగ్యదేవుడు ఆరుమొగాలరేడు!! | డా॥ పులిగడ్డ విజయలక్ష్మి | 14 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 16 |
| ధన్వంతరి నారాయణుడు | డా॥ పి.లలితవాణి | 18 |
| అగస్త్యమహర్షి మహత్కార్యాలు | కూమారి యస్.లావణ్య | 20 |
| కొల్హాపురనాయకి శ్రీమహాలక్ష్మి | శ్రీ ఎం.రామక్రిష్ణ | 22 |
| ఆయన దృష్టిలో.. అందరూ ఒకటే!! | డా॥ దేవులపల్లి పద్మజ | 25 |
| గోవిందునిసాక్షిగా గోమహాసమ్మేళనం | శ్రీ కె.శివకుమార్ | 31 |
| శ్రీమద్భగవద్గీత | ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ | 36 |
| జగజ్జనని ఆవిర్భావం పంచమీతీర్థం | డా॥ పల్లం పద్మావతి | 37 |
| హరిదాసవాఙ్మయంలో... శ్రీవేంకటాచలాధీశుడు | శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు | 40 |
| భక్తి ఎంత మధురం! | డా॥ మాడభూషి జ్యోతికుమారి | 41 |
| శమీవృక్షం పూజయామి!! | శ్రీ యస్.తులసీరామ్ | 43 |
| మనసులోని కోరికను తీర్చే దేవదేవుడు | శ్రీ భాస్కరభట్ల బాలసుబ్రహ్మణ్యంశర్మ | 45 |
| సూర్యమండలం లేకపోతే భూమండలం లేదు!! | శ్రీమతి యస్.రమ్య | 46 |
| ఆరోగ్యప్రసాదగుళికలు 'శనగలు' | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 48 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>నిర్వహణ- మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 49 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 50 |
| మనిషై పుట్టాక... | శ్రీమతి రావూరి రమాదేవి | 51 |
| తిరుప్పావై (చిత్రకథ) | కథ : శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు : శ్రీ పి.తులసీప్రసాద్ | 52 |
| బాలవినోదం | నిర్వహణ: కుమారి పి.ఉషాలక్ష్మి | 54 |


ముఖచిత్రం : తిరుచానూరు శ్రీ అలమేలుమంగ గజవాహనసేవ
వెనుక చిత్రం : శ్రీ గోదాదేవి


ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.



24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333





వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

# బ్రహ్మోత్సవ దర్శనఫలం

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడనీ, ఏడుకొండలవాడనీ, వేంకటరమణుడనీ, సంకటహరణుడనీ, తిరుమలేశుడనీ, వేంకటేశ్వరుడనీ, అడుగడుగు దండాలవాడనీ, ఆపద్బాంధవుడనీ... ఇలా అనేకపేర్లతో కీర్తింపబడుతూ భక్తులచేత స్తుతింపబడుతున్న శ్రీవేంకటాచలపతియొక్క దివ్యమైన హృదయంమీద నిరంతరం అనపాయినిగా సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి కొలువై ఉంటూ దేదీప్యమానంగా ప్రకాశిస్తూంటుంది. ఆ అలమేలుమంగకు ఉన్న జ్ఞానమూ, శక్తిమహిమా ఇంతింత అని ఎవరూ చెప్పలేరు. కనీసం వాటిని తెలుసుకోలేరు కూడ. కాని, భక్తులైన వారి యోగ్యతలను, అర్హతలను బట్టి వారి వారికి తగినట్లుగా, ఆ మహాలక్ష్మీదేవి మహిమలను చూపుతూంటుంది. దానితోపాటు ధర్మ, అర్థ, కామ, మోక్షాలను నాలుగు పురుషార్థాలను వారి వారి అర్హతలను బట్టి అనుగ్రహిస్తూంటుంది.

ఇలాగ, శ్రీవేంకటేశ్వరస్వామిహృదయపు పట్టపురాణి అయిన పద్మావతీదేవి భక్తులైన బ్రహ్మాదిదేవతలకు అత్యుత్తమమైన, అనంతమైన మహదైశ్వర్య సౌభాగ్యాలను ప్రసాదిస్తూ ఉన్నప్పటికీ అహరహమూ అన్నివేళల్లో ఏమరకుండా తన ప్రభువైన శ్రీవేంకటేశ్వరస్వామిని అనుసరిస్తూ, ఆ స్వామివారి వశవర్తినియై సదా భాసిస్తూంటుంది. అందువల్లే తిరుమలేశుడు 'శ్రీనివాసుడు'గా ప్రసిద్ధి చెంది, వక్షఃస్థల లక్ష్మీదేవి సహకారంతో భక్తులకెందరికో ఎన్నోవిధాల కల్యాణపరంపరలను కురిపిస్తూ తద్వారా ఇహపరసుఖాలను అనుగ్రహిస్తూంటాడు.

ఇలాగ శ్రీవేంకటాచలపర్వత సానువులలోను చుట్టూరా ఆ యా దివ్యస్థలాల్లోనూ సిరులతల్లి కొలువై భక్తులను దయతో రక్షిస్తూ కరుణతో కాపాడుతున్నది. ఆ సిరులతల్లే మహారాష్ట్రలోని కొల్హాపురంలో 'శ్రీమహాలక్ష్మి'గాను, నారాయణవరంలో శ్రీ'పద్మావతి'గాను, తిరుచానూరులో అర్చామూర్తి రూపంలో 'శ్రీఅలమేలుమంగ'గాను, శ్రీ'పద్మావతి'గాను, తిరుమలక్షేత్రంలో శ్రీనివాసుని హృదయ పద్మంలో 'వ్యూహలక్ష్మి' గాను, 'భూతకారుణ్యలక్ష్మి' గాను, కొలువై ఉండి తనను దర్శించిన భక్తులందరికీ సిరులను గుప్పిస్తూ భక్తులపాలిట కల్పవల్లిగా కోరికలను తీరుస్తూన్నది. ఆ జగన్మాత ఎన్నోచోట్ల, ఎన్నోపేర్లతో విరాజిల్లుతూన్నప్పటికీ సాక్షాత్తు శ్రీమన్నారాయణుని పట్టమహిషే.

అలా తిరుచానూరులో కొలువై ఉన్న శ్రీఅలమేలుమంగకు అంగరంగవైభవంగా బ్రహ్మోత్సవాలు ఏకాంతంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ వివిధరకాల వాహనాలపై ఎంతో శోభాయ మానంగా కొలువుతీరి ఉంటుంది. ఈ వాహనసేవా కార్యక్రమాలను అన్నింటినీ తిరుమల తిరుపతి దేవస్థానంవారి శ్రీవేంకటేశ్వర భక్తిఛానల్‌ద్వారా ప్రత్యక్షప్రసారం గావించబడతాయి. ఆ వాహనదర్శన ఫలాల్ని కూడా ప్రసాదిస్తుంది ఆ తల్లి. అవి చిన్నశేషవాహనం–యోగశక్తి; హంసవాహనం–జ్ఞానార్జనసిద్ధి; ముత్యపుపందిరివాహనం– నిర్మలత్వం, పవిత్రత; సింహవాహనం–ఎదురులేని రాజసం; కల్పవృక్ష వాహనం–అభీష్టసిద్ధి; హనుమద్వాహనం–బుద్ధి, బలం, కీర్తి, ఐశ్వర్యం; గజవాహనం–మనోవికారజయ సిద్ధి; సర్వభూపాలవాహనం– రాజయోగాది శుభపరంపరలు; గరుడవాహనం–సకలాభీష్టసిద్ధి; సూర్యప్రభవాహనం–జ్ఞానసిద్ధి; చంద్ర ప్రభవాహనం–కరుణాకటాక్షసిద్ధి; రథోత్సవం– సకలమనోరథసిద్ధి; అశ్వవాహనం–సకలకార్యజయం; పంచమీతీర్థం– సకలపాపదోషపరిహారార్థసిద్ధి మొదలైనవి కల్గుతాయి.

కాబట్టి, మనమందరమూ శ్రీవేంకటేశ్వర భక్తిఛానల్‌లో ప్రసారమయ్యే ప్రతి వాహనసేవను తిలకించి అమ్మవారి కరుణాకటాక్షాలను సంపూర్ణంగా పొందుదాం.

*జయమంగళమ్! నిత్యశుభమంగళమ్॥*

# అంగరంగ వైభోగ ఉత్సవాల్లో... అలమేలుమంగ!!

- శ్రీమతి ఎం.పద్మావతి




**దివ్యక్షేత్రమైన తిరుచానూరులో పవిత్రమైన పద్మసరోవర పుణ్యజలాలనుండి బంగారుసహస్రపద్మంలో ఆవిర్భవించిన అలమేలుమంగమ్మకు పద్మావతి అనేపేరుతోపాటు "స్వతంత్ర వీరలక్ష్మి" అనేపేరు ప్రసిద్ధంగా ఉంది. తిరుచానూరులో శ్రీ మహారాజ్ఞి అయిన అలమేలుమంగమ్మకు పాంచరాత్రాగమశాస్త్రరీతిగా "స్వతంత్ర వీరలక్ష్మ్యారాధన" పేరుతో నిత్యారాధనలు, ఉత్సవాలు, ఊరేగింపులు ఘనంగా జరుగుతాయి. ఆ విశిష్టసేవలనుగురించి కొంత తెలుసుకుందాం...**


**నిత్యోత్సవాలు:** ప్రతిరోజు విధిగా జరిగే సేవలను నిత్యోత్స వాలు అంటారు. అందులో-

**సుప్రభాతసేవ :** వేదపండితులు, ఆధ్యాత్మిక తత్త్వవిశారదులు, పాచకపరిచారక- అధికారులు, అర్చకస్వాములు మొదలైన వారందరూ కూడా ప్రాతఃకాలంవేళనే ఆలయాన్ని చేరుకొని సుప్రభాతంతో ద్వారాలను తెరచి, లోపలకు ప్రవేశించి, అమ్మవారిని ధ్యానించి, విశేషఉపచారాలను గావించి అమ్మ వారిని మేల్కొల్పటమే 'సుప్రభాతసేవ'. ఇందులో పాలు, పండ్లు ఆరగింపు చేస్తారు.

**సహస్రనామార్చన:** ఇది భగవత్‌శక్తి దినదినాభివృద్ధి కావ డానికిగాను చేసే ప్రధానప్రక్రియ. దీనిని ఆగమశాస్త్రోక్తంగా గావిస్తారు. ఇందు అనేక మంగళకరమైన ఓషధిద్రవ్యాలు, పుష్పాలతో అర్చిస్తూ మూలమూర్తికి సహస్రనామార్చన జరుగుతుంది. ఈ అర్చన లోకక్షేమార్థం, సర్వజన సుభిక్షార్థం, సమస్తసన్మంగళావ్యాప్త్యర్థం జరుపబడుతుంది.

**పద్మావతిపరిణయం (కల్యాణోత్సవం):** కల్యాణమంటే సకలసంపదలని అర్థం. అలా భక్తుల కోరికలన్నింటినీ నెరవేర్చే కల్పవల్లి అలమేలుమంగ. అందుకనే నిత్యమూ ఆ తల్లికి చక్కని సంప్రదాయపద్ధతులతో, చక్కనిమంత్ర-తంత్ర-గద్య-పద్యాలతో నిత్యమూ కల్యాణం జరుగుతుంది. ఆ కల్యాణం సకలశుభప్రదమైనది. ఈ వేళలో అప్పాలు, చక్కెరపొంగలి, పులిహోరలు నైవేద్యంగా పెడతారు.

**సహస్రదీపాలంకరణసేవ :** దీనికే డోలోత్సవం, ఊంజల్‌సేవ అని కూడా పేర్లు. ఇది ప్రతిరోజూ సాయంత్రం జరుగు తుంది. ఈ మండపంలో అనేక నేతిదీపాలు వెలుగు తూండగా మధ్యలో ఆ తల్లి ఉయ్యాల ఊగుతూ వేదమంత్రా లతో నక్షత్రహారతి, కర్పూరహారతిని అందుకొంటుంది. ఇందులో శనగగుగ్గిళ్లు (సుండలు) నివేదిస్తారు.



**ఏకాంతసేవ:** అమ్మవారికి జరిగే నిత్యోత్సవాల్లో కడపటిది 'ఏకాంతసేవ'. షట్కాలార్చనలో చివరిది అర్ధరాత్రిపూజ. ఇందు అర్చామూర్తిని మంచంపై శయనింపచేస్తారు. ఈ ప్రధాన ప్రక్రియలో అమ్మవారికి గోరువెచ్చనిపాలు, పంచకజ్జాయం నివేదిస్తారు.

**కుంకుమార్చన:** సకలసౌభాగ్య ప్రతీక'కుంకుమ'. ఈ కుంకుమతో అమ్మవారికి మంత్రనామార్చనతో అర్చన జరుగుతుంది.



ఈ కుంకుమను భక్తులకు పంచిపెడతారు. ఇది ధరించినట్లైతే సకలసౌభాగ్యసిద్ధులు కల్గుతాయని భక్తుల నమ్మకం.

**వారోత్సవాలు:** వారానికి ఒకరోజు ప్రత్యేకంగా ఒక ఉత్సవం విధిగా జరుపబడే సేవలను వారోత్సవాలు అంటారు. అందులో

**సోమవారం- అష్టదళపాదపద్మారాధనం:** అష్టదళాలతో కూడిన 108 స్వర్ణపుష్పాలను ఒక్కొక్క నామమును ఉచ్చరిస్తూ అమ్మవారి పాదపద్మాలపై అర్చించటాన్నే 'అష్టదళపాదపద్మారాధనం' అంటారు. దీనికే 'స్వర్ణపుష్పార్చన' అని మరోపేరు.

**గురువారం - తిరుప్పావడసేవ (అన్నకూటోత్సవం) :** చిత్రాన్నమును (పులిహోర) రాశిగా పోసి అమ్మవారిముందు నైవేద్యం చేయటాన్నే 'తిరుప్పావడ' అంటారు. దేశప్రజలంతా పాడిపంటలతో సుఖంగా ఉండాలని, ఆహారానికి ఎటువంటి ఇబ్బందీ రాకూడదని, సర్వసౌభాగ్యాలు కలగాలని, పాడిపంటలు అభివృద్ధి పొందాలని, ఎటువంటి ఈతిబాధలు కలుగకూడదని సంకల్పాన్ని చెప్తూ ఈ సేవను గావిస్తారు. ఈ సేవలో పులిహోరతోపాటు ప్రత్యేకంగా జిలేబీలు కూడా నివేదిస్తారు.

**శుక్రవారం - వస్త్రాలంకరణసేవ :** భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పించిన వస్త్రాలను ఆ తల్లికి ఎంతో రమణీయంగా, చిత్రవిచిత్రంగా అలంకరిస్తారు. ఇలా చేస్తే ఆపద సమయాల్లో ఆ తల్లి చల్లగా వస్త్రంకప్పి కాపాడుతుందని భక్తుల విశ్వాసం.

**శుక్రవారం-అభిషేకం:** అమ్మవారిమూలమూర్తికి ఈ అభిషేకసేవ నిర్వహిస్తారు. ఇందులో అనేక సుగంధద్రవ్యాలను కలిపి అభిషే



కిస్తారు. ఇలా అమ్మవారిని అభిషేకిస్తే సర్వసంపదలు కల్గుతాయని పురాణోక్తి.

**శుక్రవారం- లక్ష్మీపూజ:** ప్రతి శుక్రవారం కల్యాణోత్సవానికి ముందుగా కల్యాణమంటపంలో 'లక్ష్మీపూజ' జరుగుతుంది. లక్ష్మి జగన్నాయకి. ఆ జగన్మాతకు సకలషోడశోపచారాలతో పూజచేస్తే సకల సంపత్ప్రదాయకమవుతుంది. అన్ని మనో వాంఛలను సిద్ధింపచేసే సేవ ఇది.

**శుక్రవారం- సహస్రదీపాలంకరణసేవ:** నిత్యకల్యాణం తర్వాత అమ్మవారు గుడికి దక్షిణదిక్కులో ఉన్న శుక్రవారపుతోటకు వెళ్లిన తర్వాత ఆ తోటలో పసుపు, చందనం మున్నగు ద్రవ్యాలతో అభిషేకం జరుగుతుంది. అక్కడినుండి ఆస్థానమండపంలో ఊంజల్‌సేవ అయిన తర్వాత ప్రతిశుక్రవారం ఊరేగింపుగా గ్రామోత్సవం జరుగుతుంది.

**శనివారం- పుష్పాంజలిసేవ:** మూలమూర్తికి ఎన్నోరకాల పుష్పాలతో అంజలిసేవ జరుగుతుంది. అమ్మవారి నిర్మలమైన మనశ్చిత్తశాంతికి ఈ సేవ జరుగుతుంది.

**మాసోత్సవాలు:** మాసానికి ఒకమారు జరిగే సేవలను మాసోత్సవాలు అంటారు. అందులో

**అష్టోత్తర శతకలశాభిషేకం: (ప్రతినెలలో మొదటి బుధవారం):** మూలమూర్తికి వైభవంగా జరిగే వైదికప్రక్రియ ఇది. పాలు-పెరుగు- తేనె- పసుపు- చందనం మొదలైన ద్రవ్యాలతో అభిషేకం, విశేషహోమం, నైవేద్యం జరుపుతారు. 108 కలశాలు అమ్మవారియొక్క అభిషేకంలో ఉపయోగిస్తారు. కావున దీనికి ఈ పేరు సార్థకమైంది. ఇది ఉత్తమోత్తమ అభిషేకవిధానమని ఆగమశాస్త్రాలవాక్కు.

**నక్షత్రోత్సవాలు:** అమ్మవారి జన్మనక్షత్రమైన ఉత్తరాషాఢ, ఏకాదశిరోజుల్లో అమ్మవారి ఉత్సవమూర్తికి ఏకాంతంగా అభిషేకం జరుగుతుంది.

**సంవత్సరోత్సవాలు:** సంవత్సరానికి ఓమారు జరిగే ఉత్సవాలను సంవత్సరోత్సవాలు అంటారు. అందులో..

**వసంతోత్సవం :** వైశాఖమాసం పూర్ణిమకు మూడురోజులపాటు వసంతోత్సవాలు జరుగుతాయి. వసంతఋతువులో అమ్మవారికి



జరిగే ఈ ఉత్సవానికి వసంతోత్సవం అని పేరు. సుగంధ సంభరితపుష్పాలతో అమ్మవారిని సేవించి, వివిధరకాలఫలాలను కూడా తెచ్చి అమ్మవారికి నివేదించటం ఈ వసంతోత్సవంలో ప్రధాన ప్రక్రియ. పున్నమిరోజున స్వర్ణరథోత్సవం జరుగుతుంది.

**వరలక్ష్మీవ్రతం :** తిరుచానూరులో కొలువై ఉన్న అమ్మవారికి ఆగష్టునెలలో వచ్చే వరలక్ష్మీవ్రతంరోజున ఆస్థానమండపంలో అమ్మవారిని ప్రతిష్ఠించి ఈ వ్రతాన్ని అత్యంతవైభవంగా నిర్వహిస్తారు. ఆ రోజున వ్రతంలో పాల్గొనదలచినవారికి అవకాశమిచ్చి సామూహిక వ్రతపూజలు నిర్వహింపబడుతాయి. అర్చకుల వేదమంత్రాలతో, సర్వశుభసంకల్పంతో పూజలు



జరుగుతాయి. అందులో భక్తులందరూ పాల్గొని ఆ తల్లి కృపాకరుణాకటాక్షాలను పొందుతారు.

**పవిత్రోత్సవం:** ప్రతిసంవత్సరం భాద్రపదమాసం పున్నమకు మూడురోజులపాటు పవిత్రోత్సవాలు జరుగుతాయి. నిత్యమూ



జరిగే అర్చనలో ఏవైనా దోషాలుంటే వాటిని నిర్మూలించే ప్రక్రియే పవిత్రోత్సవం.

పట్టుదారాలతో పవిత్రములను తెచ్చి వైదికక్రియలతో సంస్కరించి, వేదమంత్రాలతో హోమాన్ని నిర్వర్తించి, సుముహూర్తసమయంలో పవిత్రాలను అమ్మవారికి సమర్పించటమే పవిత్రోత్సవ ప్రక్రియ. ఇందులో పాల్గొన్నవారికి చీడపీడలన్నీ తొలగి సుఖసంతోషాలతో ఉంటారని భక్తుల నమ్మకం.

**లక్షకుంకుమార్చన:**అమ్మవారికి ప్రతియేటా జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందురోజు అత్యంతవైభవంగా లక్షకుంకుమార్చనసేవ జరుగుతుంది.



శతసహస్రనామాలతో అయితేనేమీ, అష్టోత్తరశతనామాలతో అయితేనేమీ, వేదమంత్రాలతో, అర్చకస్వాములతో ప్రతి కుంకుమబొట్టుకు అమ్మవారి ప్రాశస్త్యాన్ని కలుగజేస్తూ జరిగే తంతు ఇది. స్త్రీకి కుంకుమయే సౌభాగ్యచిహ్నం. ఆ సౌభాగ్యాన్ని ఆ తల్లికి మంగళకరంగా అందిస్తూ, ఆ తల్లి ఆ వేళలో చల్లగా ఉంటే బ్రహ్మోత్సవాలు ఆనందకరంగా, అవిఘ్నంగా సాగుతాయని పెద్దలవాక్కు. ఇందులో కూడా ఎందరోభక్తులు పాల్గొని తమ సౌభాగ్యాన్ని కూడా కాపాడాలంటూ ఆ తల్లిని కోరుకొని కటాక్షసిద్ధిని పొందుతుంటారు.

**బ్రహ్మోత్సవాలు :** తిరుచానూరు పద్మావతిఅమ్మవారికి నవంబరు నెలలో అంగరంగవైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఆ బ్రహ్మోత్సవాల్లో అమ్మవారు పలురకాలైన వాహనాలపై నయనానందకరంగా, రమణీయంగా ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తారు. ఈ బ్రహ్మోత్సవాల్లో పంచమీతీర్థం ప్రధానమైనది. ఈ ఉత్సవానికి హాజరై అమ్మవారితోపాటు పుష్కరిణిలో మునిగి తమ పాపాలను ప్రాయశ్చిత్తం చేసుకోవటమే దీని ప్రసిద్ధి.





## పుష్పయాగం

తిరుచానూరులో జరిగే పంచమీతీర్థం మరుసటిరోజున అమ్మవారికి అత్యంతవైభవంగా పుష్పయాగం జరుగుతుంది. నిత్య పూజలో చెప్పే మంత్రపుష్పంతోపాటు బ్రహ్మోత్సవాలు మొదలైన విశేషఉత్సవాలు జరిపినతర్వాత జరిపే గొప్పయాగం 'పుష్పయాగం'. ఆయాకాలాల్లో లభించే వివిధరకాలైన పుష్పాలతో వైభవంగా ఈ యాగం నిర్వహిస్తారు. ఇంతటి ప్రాశస్త్యమున్న పుష్పాలతో పూజలు చేసే విధానం ఎంతో పవిత్రమైనది. లోకోపకారమైన, దివ్యమైన ఈ విధానంవల్ల సర్వజగత్తుకు సుఖసంపదలు, శాంతి సౌభాగ్యాలు కలగాలని చేసే గొప్పపూజావిధానమే "పుష్పయాగం".







**తెప్పోత్సవం:** దీనికే క్షీరార్ణవఉత్సవం, ప్లవోత్సవమనీ పేర్లు. జ్యేష్ఠమాసపూర్ణిమకు ఐదురోజులపాటు తెప్పోత్సవాలు జరుగుతాయి. మొదటిరోజు ఏకాదశినాడు శ్రీకృష్ణస్వామికి, రెండవరోజు ద్వాదశినాడు శ్రీ సుందరరాజస్వామికి, చివరి మూడురోజులు పద్మావతి అమ్మవారికి, పెద్దపుష్కరిణిలో తెప్పోత్సవాలు జరుగుతాయి. ఈ సేవాసందర్శనం అజ్ఞానచీకట్లను పారద్రోలి నిర్మల జ్ఞానవెలుగుల్నీ, సమస్తసంపదల్నీ ప్రసాదిస్తుందని భక్తులనమ్మకం.












ఇలా శ్రీనివాసభగవానుని పట్టపుదేవేరి అయిన పద్మావతిఅమ్మవారు అర్చామూర్తిగా వేంచేసి ఉన్న తిరుచానూరు క్షేత్రం అంగరంగవైభోగంగా నిత్యమూ ఉత్సవాలతో అలరారుతూ ప్రసిద్ధపుణ్యక్షేత్ర తీర్థరాజంగా వెలుగొందుతోంది.

# శ్రీమద్భగవద్గీత

## 12వ-అధ్యాయం (సారసంగ్రహం)

విద్వాన్, డా॥ ఈ.జి. హేమంతకుమార్

ధారావాహిక



### భక్తియోగం - అధ్యాయ నామౌచిత్యం

భక్తిని గురించి ప్రతిపాదించిన అధ్యాయం కనుక దీనికి భక్తియోగమనే పేరొచ్చింది. భక్తియొక్క స్వరూపం, భక్తుల లక్షణాలు, వివిధ ఆధ్యాత్మికసాధనలు ఈ అధ్యాయంలో పేర్కొనబడ్డాయి. ఈ అధ్యాయం భక్తితో ప్రారంభింపబడి భక్తితోనే అంతమౌతుంది.

భక్తుల్లో నిర్గుణభక్తులు, సగుణభక్తులున్నారు. నిర్గుణ భక్తికంటే సగుణభక్తి సులభం. నిర్గుణభక్తి క్లేశావహం. దేహాభి మానం కలవారి కది సులభం కాదు. అందుచేత సగుణభక్తియే ఉపాయం అని ఈ ద్వాదశోధ్యాయం వివరించింది.

భక్తివలన భగవదైక్యం కలుగుతుంది. కనుకనే భక్తి యోగమనే పేరొచ్చింది. ఇది చాలా చిన్న అధ్యాయం. శ్లోకాలు కూడా చాలా సులభం. భక్తి కూడా ఎంత సులభసాధ్యమో తెలపడంకోసం ఈ లాగున చేయడమైంది. భగవద్భక్తుల కుండవలసిన సుగుణాలు చాలా చక్కగా ఏడుశ్లోకాల్లో ఈ అధ్యాయంలో తెల్పబడ్డాయి.

సమశ్శత్రౌ చ మిత్రే చ తథా మానావమానయోః ।
శీతోష్ణ సుఖ దుఃఖేషు సమస్సంగ వివర్జితః ॥ 18

శత్రుమిత్రులపట్ల సమభావం కలిగినవాడు, మానావ మానాలను, శీతోష్ణాలను, సుఖదుఃఖాలను, నిందా ప్రశంసలను సమంగా భావించేవాడు అయిన నరుడంటేనే తన కిష్టమన్నాడు భగవంతుడు. అంతేకాకుండా భక్తులు అనేకరకాలుగా ఉంటా రని ఉత్తమశ్రేణికి చెందిన భక్తులు ఈ క్రింద చెప్పబడిన గుణాలను కలిగి ఉండేవారైతే తనకు ప్రీతిపాత్రులవుతారన్నాడు.

01) ఏ జీవిపైన ద్వేషం లేకుండుట
02) స్నేహం
03) దయ
04) మమకారం లేకుండుట
05) అహంకారం లేకుండుట
06) సుఖదుఃఖాలందు సమత్వం
07) ఓర్పు
08) నిత్యతృప్తి
09) మనోనిగ్రహం
10) దృఢమైన కర్తవ్యనిశ్చయం
11) మనస్సును, బుద్ధిని, జీవితాన్ని భగవదర్పణం చేయటం
12) లోకంవల్ల తాను, తనవల్ల లోకం భయపడకుండటం
13) కామక్రోధలోభమోహమదమాత్సర్యాలను జయించడం
14) ఏ అపేక్ష లేకుండటం
15) ఆచారంతో మసలుకోవడం
16) సామర్థ్యం కల్గి ఉండడం
17) తటస్థంగా ఉండటం
18) ఏ చింత లేకుండటం
19) సర్వకర్మఫలపరిత్యాగం
20) హర్షం లేకుండుట
21) ద్వేషం లేకుండుట
22) శోకం లేకుండుట
23) కోరిక లేకుండుట
24) శుభాశుభ - పరిత్యాగం
25) శత్రుమిత్రులందు సమభావం
26) మానావమానములందు సమభావం
27) శీతోష్ణాదులందు సమభావం
28) సుఖదుఃఖములందు సమభావం
29) నిందాస్తుతులందు సమభావం
30) వేటిపై ఆసక్తి లేకుండుట
31) మౌనం
32) లభించినదాంతో తృప్తి

33) నివాసమునందు అభిమానం లేకుండుట

34) స్థిరమైన బుద్ధి కల్గి ఉండటం

35) భగవంతునియందు భక్తి.

ఎవరు ఈశ్వరుణ్ణే పరమగతి అని నమ్మి అమృతప్రాయమైన ధర్మాన్ని ఉపాసిస్తారో– శ్రద్ధతో నడుచుకుంటారో అట్టివారే నాకు మిక్కిలి ప్రియులని ఈ శ్లోకంతో భక్తియోగాన్ని ముగించారు.

యే తు ధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే ।
శ్రద్ధధానా మత్పరమా భక్తాస్తే తీవ మే ప్రియాః ॥ 20

ఈవిధంగా భక్తితత్త్వాన్ని వివరించిన అధ్యాయం కనుక భక్తియోగమనే పేరు సర్వవిధాల సమర్థనీయం. గీతాపారాయణం చేసేవాళ్ళు మొదట ఈ అధ్యాయంతో ప్రారంభించి తరువాత మొదటి అధ్యాయంనుంచి చదవటం మంచిదని పెద్దలు చెబుతుంటారు. ఈ అధ్యాయ పారాయణంవల్ల ఇష్టదేవతా సాక్షాత్కారం, మృతసంజీవనిశక్తి కల్గుతుందని పెద్దలమాట.

## అర్జును డంటున్నాడు

కృష్ణా! ఎడతెగని నిష్ఠతో నీయందే మనసు నిల్పి సాకారాన్ని అర్చించేవాళ్ళు గొప్పవాళ్ళా? నిరాకారమైన ఆత్మను గూర్చి, పరబ్రహ్మాన్నిగూర్చి ఉపాసించేవారు గొప్పవారా? ఈ ఇరుతెగలవారిలో శ్రేష్ఠులైన యోగులు ఎవరు? సాకారమా? నిరాకారమా? ఏది మేలు? అని అర్జునుడి ప్రశ్న.

## భగవంతు డంటున్నాడు

మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే ।
శ్రద్ధయా పరయోపేతాః తే మే యుక్తతమా మతాః ॥ 2

అర్జునా! ఎవరు చలింపని నిష్ఠతో నాయందు మనసు లగ్నం చేసి పరమశ్రద్ధతో నిత్యమూ నన్నుపాసిస్తూ, కీర్తిస్తూ, పూజిస్తారో వారు శ్రేష్ఠులైన యోగులని నేను భావిస్తున్నాను. ఎవరు ఇంద్రియాలనన్నిటినీ నిగ్రహించినవారై, అంతటా సమబుద్ధి కల్గి, అన్ని ప్రాణులయొక్క మేలుకోరి, ఇటువంటిది అని సూచించటానికి వీలుకానిది, కంటికి కనబడనిదీ, అంతటా వ్యాపించిందీ, మనోభావాలకు అందనిదీ అయిన అక్షర పరబ్రహ్మాన్ని ఉపాసిస్తారో వారు నన్నే పొందుతారు. అయితే దేహాభిమానం కలవారు నిర్గుణమైన పరబ్రహ్మాన్ని ఉపాసించి ప్రయాసతో ఆలస్యంగా నన్ను చేరుకుంటారు.

తేషామహం సముద్ధర్తా మృత్యుసంసార సాగరాత్ ।
భవామి న చిరాత్పార్థ ! మయ్యా వేశిత చేతసామ్ ॥ 7

అర్జునా! అనన్యమైన భక్తితో కర్మల్ని నా కర్పించి, నాయందే ఆసక్తి కల్గి, నన్నే సదా ధ్యానించి, నాపై చిత్తం నిల్పిన అలాంటి భక్తుల్ని జనన మరణరూపమైన ఈ సంసారసముద్రం నుంచి నేను వెనువెంటనే ఉద్ధరిస్తాను. ఒకవేళ నాపై స్థిరంగా మనస్సు నిల్పడానికి నీకు సమర్థత లేకపోతే, నాకు ప్రీతికరమైన సత్కార్యాలను ఆచరించు. అది కూడా వీలుకాని పక్షంలో అన్ని కర్మల ఫలాలను నాకు వదలిపెట్టు.

శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే ।
ధ్యానాత్కర్మఫలత్యాగః త్యాగాచ్ఛాంతి రనన్తరమ్ ॥ 12

అర్జునా! అభ్యాసం(సాధనం) కంటే జ్ఞానం మేలు. జ్ఞానంకంటే ధ్యానం మంచిది. ధ్యానంకంటే కర్మఫలాన్ని త్యాగం చేయడం శ్రేష్ఠం. త్యాగంచేతనే శాంతిని పొందుతారు. అర్జునా! చిత్తశాంతిని పొందిన ఉత్తమశ్రేణికి చెందిన భక్తునియొక్క లక్షణాలెట్లా ఉంటాయో వివరిస్తాను విను. భక్తియోగనిష్ఠుడు సర్వప్రాణులపట్ల ద్వేషం లేకుండా– స్నేహాన్ని–దయను నిరంతరం కల్గి ఉంటాడు. 'ఇదినాది' అనే మమకారాన్నిగానీ, 'ఇది నేను చేస్తున్నాననే అహంకారం గానీ లేకుండా ప్రవర్తిస్తాడు. సుఖ దుఃఖాలను సమంగా సహిస్తాడు. ఓర్పుతో ఉంటాడు.

సంతుష్టః సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః ।
మయ్యర్పిత మనోబుద్ధిః యో మద్భక్తస్స మే ప్రియః ॥ 14

ఎప్పుడూ తృప్తితో జీవిస్తూ, మనోనిగ్రహంకల్గి ఉంటూ, జీవితలక్ష్యాన్ని గూర్చి స్థిరమైన కర్తవ్యాన్ని నిశ్చయించుకున్నవాడై ఉంటూ, మనోబుద్ధులను భగవదర్పణం చేస్తూ లోకయాత్ర చేస్తూ ఉండేవాడే నాకు చాలా ఇష్టుడైన భక్తుడు. ఎవరివల్ల లోకం భయపడదో, ఎవరు లోకంవలన కూడా భయపడరో, సుఖదుఃఖాలు, మానావమానాలు, శుభాశుభాలు ఎవరిపైన ఏ రకమైన ప్రభావాన్ని చూపవో అతడే నా కత్యంత ప్రీతిపాత్రుడు.

తుల్యనిందాస్తుతి ర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్ ।
అనికేతః స్థిరమతిః భక్తిమాన్మే ప్రియో నరః ॥ 19

శత్రుమిత్రులపట్ల సమభావం కలవాడు, మౌనంగా ఉంటూ, దొరికిన దానితో తృప్తిని పొందుతూ కాలం గడిపేవాడూ, స్థిరంగా ఒకచోటే ఉండక, నిశ్చలభక్తి గల్గిన సద్గుణ పరులైన ఉత్తమోత్తమభక్తులు నాకు మిగుల ఇష్టులు.

శ్రీకృష్ణార్పణమస్తు.



# ఆరోగ్యదేవుడు ఆరుముగాలరేడు!!

- డా॥ పులిగడ్డ విజయలక్ష్మి, 99890 63761

“ఓం సం సుబ్రహ్మణ్యాయ నమః” అన్న మంత్రరాజం సుబ్రహ్మణ్యేశ్వరుని భక్తులు నిత్యం పఠించే మంత్రం. వారికి సకలశుభాలూ ప్రసాదించే దివ్యమంత్రం. ‘సు’ అంటే మంచి- ‘బ్రహ్మణ్య’ అంటే బ్రహ్మజ్ఞాని అని అర్థం. సృష్టి స్థితి లయాలకు ముందు వాటిని నిర్మించే జ్ఞానజ్యోతి ఏదైతే ఉందో అదే సుబ్రహ్మణ్యం. ఆ దేవదేవుడు సాకారుడుగా ఉన్నప్పుడు బ్రహ్మజ్ఞానిగా తెలుపబడతాడు. నిరాకారస్థితిలో ఉంటే ఆయనే సచ్చిదానందస్వరూపం. అటువంటి పరమాత్ముడు రూపం దాల్చి జగత్కల్యాణానికి పూనుకొన్న అవతారం ధరించటమే సుబ్రహ్మణ్యేశ్వరుని లీలా విశేషం.

శివపార్వతులకు నందనుడు జన్మించాలని, ఆ నందనుడు తారకాసురుని సంహరించి లోకకల్యాణం జరిపించాలని ముక్కోటి దేవతలు హరి బ్రహ్మలతో సహా కోరుకున్నారు. శంకరుని ప్రార్థించారు. పరమశివుడు ప్రసన్నుడైనాడు. పార్వతీదేవినుంచి బయటకు వచ్చి, దేవతల నాదరించిన పశుపతి, వారి కోరిక మేరకు తన తేజస్సు యజ్ఞకుండంలో వదిలాడు. రుద్రతేజస్సు భరించలేకపోయిన అగ్ని, ఆ తేజస్సును అరుంధతీదేవి తప్ప మిగిలిన ఆరుగురు సప్తర్షుల భార్యల రూపాలను దాల్చి స్వాహాదేవి భర్తతో సుఖిస్తున్న సమయంలో ఆమె రోమకూపాలద్వారా ఆరురూపాలలోకి ప్రవేశింపచేశాడు. ఆ కారణంగా ఆ ఆరుగురు కృత్తికలు గర్భవతులైనారు. శివతేజస్సు మోయలేకపోయిన వారు,ఆ తేజస్సును హిమవత్పర్వతంమీద వదలగా, ఆ శైలాధిపతి దానిని భరించలేక గంగానదిలోకి వదిలాడు. గంగ కూడా అసమర్థురాలైనదై, తన తీరాన ఉన్న రెల్లుగడ్డిలోకి శివ తేజస్సును విడిచింది. కొంతకాలానికి ఆ తేజస్సు బాలకునిరూపంలో అవతరించింది. రెల్లుపొద అంతా దేదీప్యమానంగా ప్రకాశించింది. దశదిశలు కోటికాంతులతో ప్రతిఫలించాయి. ఆ బాలకుని ఆవిర్భావ శుభఘడియ- మార్గశిరమాస శుద్ధ షష్ఠీతిథి. ధనిష్ఠానక్షత్రయుక్త వృశ్చికలగ్నమందలి తెల్లవారుఝాము.

శివతేజస్సుతో వెలిగిపోతున్న ఆ కుమారుడికి విశ్వామిత్ర మహర్షి వేదోక్తసంస్కారం చేశాడు. అగ్నిహోత్రుడు వచ్చి పుత్రుని కౌగిలించుకొని “శక్తి” అనే ఆయుధాన్ని కాన్కగా ఇచ్చాడు. ఆ శక్తిఆయుధాన్ని ధరించి శివకుమారుడు పర్వతాన్ని ఎక్కి శిఖరాన్ని కొట్టగానే ఆ శిఖరం కూలిపోయింది. తారకుడు పంపిన రాక్షసులను శైశవంలోనే నేలకూల్చి తన పరాక్రమాన్ని చాటుకున్నాడు ఆ పసివాడు. శివతేజో సముద్భవుడాయె మరి!! అదేసమయంలో అటుగా వచ్చిన ఋషిపత్నులు బాలుని చూసి అతనికి స్తన్యమివ్వడానికి నేనంటే నేనని ముందుకు రాగా బాలుడు చిత్రంగా ఆరుముఖాలు ధరించి ఆరుగురు తల్లులవద్ద ఒకేసమయంలో పాలుత్రాగి వారిని తృప్తిపరిచాడు. నాటినుండి కుమారుడు షణ్మాతురుడిగా, షణ్ముఖుడిగా ప్రసిద్ధి చెందాడు. బ్రహ్మ వచ్చి ఆ షణ్మాతురుడికి స్కందుడని నామకరణం చేశాడు. క్షణక్షణం పెరుగుతున్న కుమారుడు తారకాసురసంహారానికి సిద్ధమైనాడా అన్నట్లు మహా పరాక్రమశాలిగా రూపుదిద్దుకొన్నాడు.

పార్వతీపరమేశ్వరుల సంగమకారణంగా జన్మించిన స్కందుని ఆ ఆదిదంపతులు తమ చెంతకు చేర్చుకొని ఉపనయనం


చేసి, ఇంద్రపుత్రి అయిన దేవసేననిచ్చి వివాహం చేసి తారకాసురసంహారానికి నియోగించారు. వెంటనే దేవేంద్రుడు కుమారుని దేవసేనానిగా నియమించాడు. పరమేశ్వరుడు శూలాన్ని, పినాకాన్ని, పాశుపతాస్త్రాన్ని కుమారునికిచ్చి ఆశీర్వదించాడు. విష్ణుమూర్తి చక్రాయుధాన్నివ్వగా, బ్రహ్మ బ్రహ్మాస్త్రాన్ని, సూర్యుడు రథాన్ని, చంద్రుడు అమృతభాండాన్ని, సముద్రుడు రత్నాలను, హిమవంతుడు మణిభూషణాలను, గరుడుడు వాహనంగా నెమలిని, పార్వతీదేవి దీర్ఘాయుష్షును, లక్ష్మి వైభవాన్ని, సరస్వతి చదువులను ఇచ్చి కుమారుని సర్వసమృద్ధుని చేశారు.

తన జన్మకారణమైన తారకసంహారాన్ని తృటిలో చేశాడు కుమారస్వామి. పరమ శివభక్తుడైన తారకాసురుని కంఠమందున్న అమృత లింగాన్ని శివపుత్రుడు ఆగ్నేయాస్త్రంతో అయిదుఖండాలుగా ఖండించి, ఆ శివలింగఖండాలను ఇంద్రాదులచే శివస్వరూపాలుగా ప్రతిష్ఠింప చేశాడు. అంతకుముందే తారకుడు ప్రయోగించిన మహేశ్వరాస్త్రాన్ని నిలువరించి ఆ అసురునిమీద కుమారుడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి, సంహరించి విజయశీలుడైనాడు. ఆ అయిదు శివలింగఖండాలే– అమరారామంలో అమరేశ్వరుడిగా, దాక్షారామంలో భీమేశ్వరుడిగా, కుమారారామంలో కుమారభీమేశ్వరుడిగా (సామర్లకోటలో), క్షీరారామంలో క్షీరరామలింగేశ్వరుడిగా, సోమారామంలో (భీమవరం) సోమేశ్వరుడిగా ప్రతిష్ఠింపబడ్డాయి. పరమేశ్వరుడు పంచారామాలుగా ప్రసిద్ధిచెందిన ఆ అయిదుప్రదేశాలలోను భక్తవశంకరుడిగా పూజలందుకొంటున్నాడు. సుబ్రహ్మణ్యుడు కూడా తండ్రివలెనే భక్తుల అభీష్టాలను వెనువెంటనే తీర్చే దయామయుడు. అందుచేతనే క్రౌంచుడనే పర్వతరాజు కోరగా తన శక్త్యాయుధంతో బాణాసురుని, కుముదుడనే శేషుని కుమారుడు ప్రార్థించగా ప్రలంబాసురుని వధించి భక్తపరాధీనుడైనాడు.

విజయోత్సవానంతరం పుళిందరాజుచేత పెంపబడిన శ్రీవల్లిని వివాహమాడి దేవసేనా శ్రీవల్లీసనాథుడై సకలలోకవాసులచేత సంస్తుతింపబడుతున్న కుమారస్వామికల్యాణం మార్గశిరశుద్ధ షష్ఠినాడు భక్తులు జరిపి తృప్తి చెందడం విశేషం. జన్మదినంనాడే కల్యాణం చేయడం భక్తుల ఆనందానికి నిదర్శనం.

ప్రణవతత్త్వాన్ని పరమేశ్వరుడికే ప్రబోధించిన సుబ్రహ్మణ్యుడు బ్రహ్మజ్ఞాననిధులలో అగ్రగణ్యుడు. ఆత్మజ్ఞాననిరూపణకు, కుండలినీశక్తి సాధనకు సుబ్రహ్మణ్యుడే ఆరాధ్యుడు. మేలుకొలుపుకు మూలమైన కుక్కుటాన్ని (కోడిని) ధ్వజంగా కలిగి ఉండటంతో జీవిలోని ఆత్మజ్ఞానాన్ని ఉద్బోధపరచడానికే ఆయన కుక్కుట ధ్వజుడైనాడని అవగతమవుతుంది. నాగదేవుడిగా, వల్లీసనాథుడిగా స్తుతింపబడుతున్న కుమారస్వామికి (సుబ్రహ్మణ్యేశ్వరుడు) చలిమిడి, చిమ్మిలి, పానకం, ఆవుపాలు నైవేద్యంగా సమర్పించి భక్తులు తమ అభీష్టాలను నెరవేర్చుకొంటుంటారు. సంతానం కలగటానికి సుబ్రహ్మణ్యుని ఆరాధించటం, నాగప్రతిష్ఠ చేయటం ఆనవాయితీ. కళ్ళు దెబ్బతిన్నా వెండికళ్ళను, వెండి పడగలను చేయించి సుబ్రహ్మణ్యస్వామికి సమర్పిస్తారు. బిల్వదళాలతో, ఎర్రనిపూలతో, తెల్లజిల్లేడుతో పూజించడం స్వామివారికిష్టమన్నది భక్తులనమ్మిక. వివాహం జరగాలన్నా కూడా సుబ్రహ్మణ్యుడికి మ్రొక్కుకుంటారు. కుజదోషనివారణకు, నాగదోషపరిహారానికి సుబ్రహ్మణ్యుని పూజించి చరితార్థులౌతారు. మార్గశిరశుద్ధషష్ఠి నాడు గుడిలో పూజచేయడం, పుట్టలో పాలు పోయడం చేస్తే స్వామి అనుగ్రహిస్తాడనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే ఆనాడు సుబ్రహ్మణ్యషష్ఠిగా సకల లోకవాసుల పూజలందుకొంటున్నాడు కుమారస్వామి. తెలుగుదేశంలో పంచారామాలు ఉన్నట్లే తమిళదేశంలో ప్రసిద్ధమైన ఆరు షణ్ముఖ క్షేత్రాలున్నాయి. అవే– తిరుప్పరకుంద్రం, తిరుచెందూరు, పళని, స్వామిమలై, తిరుత్తణి, పళముదిర్‌చోళై–అనేవి. ఈ ఆరుక్షేత్రాలలోను సుబ్రహ్మణ్యేశ్వరస్వామి– ఆరువిధాలరూపాలలో కొలువబడుతూ వరప్రదాతగా శరణుఇస్తాడు. కర్ణాటకదేశంలో కుక్కిక్షేత్రం, ఆంధ్రదేశంలో మోపిదేవిక్షేత్రం అంత ప్రసిద్ధమైనవే.






*(గత సంచిక తరువాయి....)*

"కలౌ పునః పావరతాభిభూతే న ఉద్భభూవాఽ ఽ(శిత వత్సలత్వాత్, అర్చాత్మనా సర్వజనాన్ సుగోప్తుం సర్వాధికో వేంకట భూధరేంద్రః."

(పాపాసక్తులగు దుర్జనులచేత కలికాలం పరిభవింప బడగా శ్రీమన్నారాయణుడు ఆశ్రితవత్సలుడగుటచేత అర్చారూపముననుండి సర్వజనులను చక్కగా కాపాడుటకై సర్వాధికుడగు వేంకటాచలాధీశ్వరుడుగా ఆవిర్భవించాడు.)

అనియు పెక్కుస్థలములందు వర్ణించినరీతిగ వర్ణాశ్రమభేదములేక సర్వమానవులను రక్షించుటకై అవతరించిన శ్రీవేంకటాద్రిప్రభువును ఎల్లవారును సేవించి కృతార్థులయ్యే భాగ్యం ప్రాప్తమై ఉండగ, పంచములైన భాగవతులకు తిరుమల కొండ ఎక్కి స్వామిని సేవించటం నిషిద్ధం కావున వారలు తిరుమల దక్షిణశిఖరమునందలి తీర్థపంచకమని ప్రఖ్యాతి గన్న తీర్థములందొకటైన చండాలతీర్థంలో స్నానమాచరించి ఆ స్వయంవ్యక్తములైన దివ్యచరణాలసన్నిధికి జేరి ప్రదక్షిణ ప్రణామాదులొనర్చి ధన్యులై ఉండేట్లేర్పరచారు.

"ఘుష్యతే సంఘశ శ్చోచ్చై ర్గోవిందేతి పునః పునః"

(భక్తులు గుంపులు గుంపులుగా చేరి గోవిందా, గోవిందా! అంటూ ఉచ్చైస్వరంతో ఘోషిస్తుంటారు.)

అనినవిధంగ నైమిశారణ్యవాసులైన కొందరు మహర్షులు శుకమహర్షిముఖమున శ్రీవేంకటాచలమహిమను విని శ్రీవేంకటాచలయాత్ర చేయునపుడు (అనర్థ) నామాంతరములను విడచి "సదా గోవిందకీర్తనమ్" అనినట్లు 'గోవిందా!' అనే నామమునే మాటిమాటికిని ఎలుగెత్తి ఉచ్చరించుచు యాత్ర సాగించినారని శ్రీవరాహపురాణముననున్న అర్థవిశేషమును మనసున తలపోసి ఈ వేంకటాచలము దేవతాంతరసంబంధ గంధములేని విష్ణుక్షేత్రమనియే లోకమందు పండితపామర సాధారణంగా అందరికీ తెలిసేలా లోకమందు యాత్రాపరులగు పరమభాగవతులును ఆ పరమఋషులవలె అడుగడుగున గోవిందనామోచ్చారణము చేయుచు యాత్ర ఒనర్చునట్లు నియమము కల్పించాడు.

"కృతమాలానదీతీరే విశ్వంభరకృతే హరిః,
ఆవిరాసీ ద్రఘువరో విభీషణభయాపహః"

(విశ్వంభర మహామునికొరకై కృతమాలానదీ (వైగై అను ఏరు తీరమున శ్రీహరి (శరణాగతుడగు) విభీషణుని భయమును పోకార్చిన రఘువరుడై ఆవిర్భవించాడు.

అనినట్లు వాసిష్ఠరామాయణమున ప్రతిపాదించిన తీరుగ 'వైగై' (కృతమాల) అనే నదీతీరమున దక్షిణమధురా పురికి పడమటిదిక్కుననున్న 'కలవింకపురము' (కురువిత్తురై) అనే నగరమున విశ్వంభర నామధేయుడైన ఒకమహాముని, 'చక్రవర్తి కుమారుడు' (శ్రీరామచంద్రుడు) సముద్రతీరమందు విభీషణ విషయమున -

"అనయైనం హరిశ్రేష్ఠ దత్తమస్యాఽభయాం మయా"

(ఓయి వానరోత్తమా! అతనికి (విభీషణునకు) నే నభయమొసగితిని. ఆతనిని తోడ్కొని రమ్ము.)

అని అభయప్రదానము చేసిన అనుగ్రహవృత్తాంతమున మిగుల ఆసక్తుడై అట్టి సన్నివేశమును తనకు చూపి అనుగ్రహింపవలెననుచు భగవంతునిగూర్చి తపమొనర్చాడు. అప్పుడు భగవంతుడు ఆ ఆశ్రితునియెడ కృపతోడ అతనికి స్వప్నమున తాను తన తమ్ముడును ధనుర్ధరులై ఉన్నట్లును తమ సన్నిధానమున.

"విభీషణకృతే సర్వం విజ్ఞాప్య హరిపుంగవః.
యథేష్టం కురు రాజేంద్రేత్యుచ్చర న్నంజలిం వ్యధాత్."

(కపిశ్రేష్ఠుడు (సుగ్రీవుడు) విభీషణునికొరకై సమస్త విషయములను విన్నవించి 'రాజేంద్రా! నీ అభీష్టముప్రకారం చేయుము' అని పలుకుచు అంజలి ఘటించాడు.)

అనినవిధముగ మహారాజగు విభీషణాళ్వాన్ (విభీషణుడు) కొరకై తగు మాటలాడి చిత్తము వచ్చినరీతిగ జేసి అనుగ్రహింపుడని బద్ధాంజలియై సేవించుచున్నట్లును, శ్రీఆంజనేయస్వామియు 'స ఏష దేశః కాలశ్చ' (ఇయ్యది (అనుకూలమైన) దేశము, కాలమును) అని విభీషణుని స్వీకరించుటకు ఉచితములగు కొన్ని విజ్ఞప్తులను రామచంద్రుని సన్నిధి దగ్గర నిలిచి విజ్ఞాపన చేయుచున్నట్లును,

"వాలిసూను ర్మహాతేజాః విభీషణ ముపస్థితమ్,
దర్శయంతం తదాకాశే నిర్దిశ్యోద్ధృతపాణినా."

అన్న తీరుగ అంగదుడు ఆకాశమున వచ్చి నిలచి ఉన్న విభీషణుని అంగుళినిర్దేశమున చూపుచున్నట్లును వాసిష్ఠ రామాయణమున ఉన్న తీరున దర్శనమీయగ కాంచి మేల్కొని ఆ సన్నివేశవిశేషము తమకు నిత్యోపాసనార్థమగునట్లు అర్చారూపమున నిర్మించుకొని పెద్దకాలమారాధింపబడిన శ్రీరామచంద్రుడును శ్రీలక్ష్మణస్వామియు, కలవింకపురమనెడు ఆదిత్యనగరమున మతాంతరస్థుల ఉపద్రవము ప్రసక్తము కాగా ఒక భక్తుని ముఖమున తమను తిరుమల అడివారమునకు కొనిపోవవలసినదిగా చెప్పారు. ఆ భక్తుడును అట్లే వారిని భక్తితో కొనిపోయి, తిరుపతిలో శ్రీభగవద్రామానుజుల సన్నిధికి చేర్చినాడు. అప్పుడు శ్రీరామానుజాచార్యులవారు శ్రీశైలపూర్ణుల సన్నిధిలో ప్రవచనము చేయుచున్న శ్రీరామాయణమున విభీషణునకు అభయమిచ్చు సందర్భమైయుండెను. తిరుమలనంబియు (శ్రీశైలపూర్ణులు), శ్రీభగవద్రామానుజులును వీరు (రామలక్ష్మణాదులు) అచింతితముగ విజయము చేసియుండుట గని ఉల్లమున సంతస ముప్పతిల్ల వారిరాక తీరు విని హర్షించినాడు. విభీషణు ననుగ్రహించినట్లు ఇప్పుడీ యభయప్రదాన సందర్భమున మనలను అనుగ్రహించుటకై వీరు విజయము చేసినారని నిర్ణయించినారు. మునుపు రావణభవనమునుండి జానకీదేవి వచ్చి శ్రీరామచంద్రుని చేరినట్లు వీరికి వివాహ మహోత్సవము జరుపవలెనని నిశ్చయించి సీతాదేవి విగ్రహము నొకదానిని నిర్మింపజేయ సంకల్పించి శ్రీరామచంద్రునకు వివాహము జరిపించి పాదప్రణామము చేసి మంగళాశాసన మనుష్ఠించి 'త్రచ్చిన పాలసంద్రముననుండి కాలనేమిని సంహరించి' అని ఆరంభమయి, 'సప్తసాలములను భేదింప బాణముల ప్రయోగించి వేంకటాద్రి చేరిన భగవంతుని దివ్యపాదములను పొంది ఎల్లప్పుడు నుజ్జీవింపుడు' అను భావము గల నమ్మాళ్వారులనుగ్రహించిన శ్రీసూక్తి సత్యమగునట్లుగ తిరుమల యందు శ్రీవేంకటాచలపతి సన్నిధానమున ప్రతిష్ఠ చేయించి నిత్యారాధనము సలుప నేర్పాటు గావించారు.

*(ఇంకా ఉంది)*

### వైకుంఠపాళి
### :: 71 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 తి | రు | 2 చా | నూ | 3 రు | | 4 వే | | 5 క |
| రు | | ర్వి | | క్మ | | ల | | కా |
| 6 వెం | డి | | 7 శ్ర | వ | ణం | | 8 చే | వ |
| గ | | 9 బృ | | తి | | 10 మ | | తి |
| నాం | | 11 హ | స్తి | | 12 గ | యు | డు | |
| చి | | తి | | 13 మ | | డు | | 14 వా |
| | 15 శి | | 16 మ | న్మ | థ | | 17 హే | మ |
| | వా | | | థు | | 18 భు | | ను |
| 19 శ్రీ | ని | వా | సు | డు | | 20 వి | భు | డు |

# ధన్వంతరి నారాయణుడు


– డా॥ పి.లలితవాణి, 98490 26107

శ్రీమన్నారాయణుని అపరావతారం ధన్వంతరి. క్షీరసాగర మథనంలో అమృతకలశాన్ని చేతపట్టుకుని ఆవిర్భవించిన వైద్యదైవం. అనారోగ్యం, మరణంవంటివి ఏవీ రాకుండా కాపాడేది అమృతం. అంతటి అమృతాన్ని లోకాలకు అందజేసిన అమృతమయుడు.

ఒకచేతిలో అమృతకలశం, మరోచేతిలో పుస్తకం (ఆరోగ్యశాస్త్రం), ఇంకోచేతిలో శంఖం, వేరేచేతిలో ఆయుర్వేద మూలికలను ధరించిన చతుర్భుజుడు ధన్వంతరి. ఆయుర్వేద శాస్త్రానికి అధిదేవుడు. ఆదిదేవుడు. అధిక ధనసంపన్నత కన్నా, అమిత విద్యాసంపన్నతకన్నా కూడా మిక్కిలి ఉన్నత మైనది, అవసరమైనది ఆరోగ్యం. ఆరోగ్యం ఉంటేనే కదా విద్యను, సంపదను ఆర్జించడానికి, అనుభవించడానికి వీలు. అందుకే "ఆరోగ్యమే మహాభాగ్యం" అన్నారు. మహావశ్యకమైన ఆరోగ్యాన్ని ప్రసాదించే దేవదేవుడు ధన్వంతరి.



సూర్యభగవానుని దగ్గర ఆయుర్వేద విద్యనభ్యసించి, మనకందించిన వైద్యశిఖామణి ధన్వంతరి. వైద్యశాస్త్రరచనల నెన్నింటినో కావించి, సుశ్రుతికి గురువైనాడు. సుశ్రుతునికి శస్త్రచికిత్స నేర్పాడు. ప్రపంచంలోనే మొట్టమొదటి శస్త్రచికిత్స కుడు (సర్జన్) సుశ్రుతుడు.



వారణాసి రాజు అయిన దివోదాసునిగా అవత రించి ఆరోగ్యశాస్త్ర గ్రంథరచన చేశాడని బ్రహ్మాండ పురాణం చెప్తోంది. "చికిత్స తత్త్వవిజ్ఞానం, చికిత్సా దర్శిని, చికిత్సకౌముది" దివోదాస ధన్వంతరి రచనలు. ఈ గ్రంథాలలో సమస్తరోగాల వివరణ, ప్రతిఒక్కరోగానికి చేయవలసిన చికిత్స, ఏ రోగానికి ఏ ఔషధం వాడాలో వివరణ, ముక్కుదిబ్బడనుండి రాచ పుండువరకు– వాడవలసిన ఔషధ సూచన– ఇలా ఎన్నో ఎన్నెన్నో విషయాలు సమగ్రంగా ఉన్నాయి. వీటి ఆధారంగానే సుశ్రుతుడు తన సంహితరచన చేశాడని ప్రతీతి. ధన్వంతరి శిష్యరికంలో పసుపును క్రిమిసంహారిణి (Antibiotic & Antiseptic)గా నిర్ధారించాడు సుశ్రుతుడు.



తనకు తానేది కోరునో ఇతరులకు కూడా అదే కోరుకోవాలి

ధన్వంతరి తన ఆయుర్వేదశాస్త్రగ్రంథంలో ఎనిమిదిరకాల వైద్యవిధానాలను వివరించాడు.

**1)కాయచికిత్స-** నోటిలోనికి వేసే మందు

**2)బాలచికిత్స-** గర్భస్థశిశువునుండి 20ఏళ్ళవరకు కలిగే రోగాలకు మందు

**3)భూత లేదా గ్రహచికిత్స-** మానసికవైకల్యానికి మందు

**4)శలాకచికిత్స-** కన్ను, ముక్కు, చెవి, గొంతులకు మందు

**5)శల్యచికిత్స-** మందులతో కాకుండా చికిత్స (సర్జరీ)

**6)విషతంత్రచికిత్స-** శరీరంలోకి చేరిన రకరకాల విషప్రభావవివరణ

**7)రసాయనతంత్రచికిత్స-** వివిధరకాల మూలికల, పసరులతో రోగనివారణ

**8)వశీకరణ తంత్రచికిత్స-** నపుంసకత్వాన్ని పోగొట్టడం, సంతానభాగ్యాన్ని కలిగించడం.

ఇంత విస్తారమైన వైద్యశాస్త్రం మరొకటి లేదు. నేటి వైద్యశాస్త్రాలన్నింటికీ ఈ గ్రంథమే మూలాధారం. ఇవన్నీ సులభంగా అర్థం కావడానికి "వైద్యనిఘంటువు"ను కూడా నిర్మించాడు ధన్వంతరి.



విష్ణుమూర్తియొక్క ఏకవింశతి (21) అవతారాలలో పదకొండవది ధన్వంతరిరూపం. అందుకే "ధన్వంతరి నారాయణా" అని కొలుచుకుంటున్నాం. ఈ దేవదేవుడు జన్మించిన రోజున స్మరించి, పూజించి, ఆయనకెంతో ఇష్టమైన పాయసం నివేదన చేసి, ఆరోగ్యాన్ని అర్థించి, పరిపరివిధాలుగా ప్రార్థించి తరిస్తున్నాం. ఈరోజు నివేదించిన పాయసాన్ని కనీసం ఐదు గురికి ప్రసాదంగా పంచి ధన్వంతరిదేవుని తృప్తిపరచాలి. తెల్లనిపూలు, తులసీదళాలు విశేషించి ధనియాలతో పూజ అంటే ధన్వంతరికి మహాప్రీతి. ధన్వంతరిమూర్తినారాయణ ఆరోగ్య ప్రదాత కదా. తెల్లనిపూలు మానసికఆరోగ్యాన్ని చేకూరుస్తాయి. తులసీదళాలు మహాఔషధం. ఇక ధనియాలు-శరీరంలోని రుగ్మతను పోగొట్టి- శక్తిని, ఉత్సాహాన్ని కలిగిస్తాయి. అందుకే ఈ పూజ. నిజానికిది మన ఆరోగ్యంకోసమే!

తూర్పుగోదావరిజిల్లా ఆలమూరుమండలం చింతలూరు గ్రామంలో ధన్వంతరిదేవునికి ప్రత్యేకమైన ఆలయం ఉంది. తమిళనాడులో, కేరళలో, ఉత్తరభారతదేశంలోను ధన్వంతరి ఆలయాలున్నాయి. ఎంతకీ తగ్గని రోగాలు కూడా ఈ ఆలయ దర్శనంతో తగ్గిపోతాయని మన నమ్మకం.

సకలరోగనివారకుడైన ధన్వంతరిదేవుని ఇప్పుడు పట్టి పీడిస్తున్న ఈ కరోనావ్యాధిని సమూలంగా నిర్మూలించమని ప్రార్థిద్దాం.

"ఓం నమో భగవతే ధన్వంతరయే
అమృత కలశ హస్తాయ
సర్వామయ వినాశనాయ
త్రైలోక్య నాథాయ శ్రీమహావిష్ణవే నమః"

# అగస్త్యమహర్షి మహాత్కార్యాలు

– కూమారి యస్.లావణ్య


ప్రాచీనకాలంలో లోకంలో అనేకమంది మహర్షులు ఉండేవారు. వారు లోకకల్యాణంకోసమై యజ్ఞాలూ, తపస్సులూ చేసేవారు. ఆ తపశ్శక్తితో వారు ఎన్నో మహత్తరకార్యాలను చేసే వారు. అసాధ్యాలను సుసాధ్యం చేసి అద్భుతాలు చేసేవారు. లోకోపకారంకోసం అద్భుతమైన ఆవిష్కరణలు చేశారు. అట్టివారిలో అగస్త్యమహర్షి ప్రముఖుడని చెప్పవచ్చు.

అగస్త్యుడు ఒక ఋషి. మిత్రవరుణులు ఊర్వశికి అగస్త్యుడు, వసిష్టుడు జన్మించారు. అగస్త్యుడు గొప్ప తపస్సంప న్నుడు. తన తపశ్శక్తితో ఎన్నో అద్భుతాలు చేశాడు. అందులో కొన్ని ఇవి–

ఆగస్త్యుడొకమారు ధనార్థియై ఇల్వలునివద్దకు వెళ్లాడు. ఇల్వలుడు మహర్షిని గౌరవించి భోజనం పెట్టాడు. అందు తన తమ్ముడైన వాతాపిని మేకగా చేసి వధించి వండిపెట్టాడు. ఈ ఉపాయంతో ఇల్వలుడు బ్రాహ్మణులను చంపుతున్నాడని ఎరిగిన అగస్త్యుడు "జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం" అని పలికాడు. వెంటనే అగస్త్యుని ఉదరంలోని వాతాపి జీర్ణమైపోయాడు. దాంతో ఇల్వలుడు విచారించి ఏమీ ఎరుగనివానివలె నటించి మహర్షికి వలసిన ధనమిచ్చి పంపించాడు.



వింధ్యపర్వతం విశేషంగా పెరిగి సూర్యచంద్రులమార్గానికి అవరోధం కలిగిస్తోంది. దాంతో ముల్లోకాల్లోనూ జీవుల జీవక్రియలు స్తంభించి అల్లాడసాగాయి. రాత్రింబవళ్ళు తెలియ కున్నాయి. ఆ వింధ్యపర్వతం గర్వమణచటానికి అగస్త్యుడు వింధ్య కడకు వచ్చి నేను దక్షిణమునకు పోవుచున్నాను మార్గమిమ్మని



కోరగా వింధ్య తన రూపముపసంహరించుకొని అణగిపోయింది. అప్పుడగస్త్యుడు వింధ్యతో నేను తిరిగి వచ్చువరకు ఇట్లే ఉండుమని చెప్పి వెళ్లాడు. అగస్త్యుడు తిరిగి ఆమార్గమున రానేలేదు. అప్పటి నుండి వింధ్య అట్లే అణగి ఉంది. ఇక్కడ తపశ్శక్తితో పాటు ధీశక్తిని కూడా చక్కగా ఉపయోగించి వింధ్యపర్వతాన్ని గమ్మత్తుగా చిత్తు చేశాడు అగస్త్యమహర్షి.

కాలకేయులు మునులను బాధిస్తూండేవారు. దేవతలు కూడా కాలకేయులను ఏమి చేయలేకున్నారు. దేవతలు కాల కేయులను కొట్టి వచ్చినప్పుడంతా కాలకేయులు సముద్రంలో దాక్కునేవారు. దానివల్ల కాలకేయులు దేవతలకు కూడా సమస్యగా మారారు. వీరిబాధ పడలేక మునులు వచ్చి అగస్త్యుని వేడుకున్నారు.




అంతట అగస్త్యుడు సాగరజలాల మొత్తాన్ని త్రాగేశాడు, దాంతో కాలకేయులు బయటపడ్డారు. దేవతలపుడు వీరిని సంహరించారు. పిమ్మట సముద్రాన్ని జలపూరితం చేయుమని మునులు వేడుకున్నారు. ఆ జలమంతా నా ఉదరంలో ఎప్పుడో జీర్ణమై పోయింది, ఇంకెక్కడి జలం అన్నాడగస్త్యుడు.

వృత్రాసురుడు ఇంద్రునకు భయపడి సముద్రంలో దాక్కున్నాడు. అందువల్ల వానిని వధించటానికి ఇంద్రునకు సాధ్యం




కాలేదు. ఆ సంగతి ఇంద్రుడు బ్రహ్మతో చెప్పుకొని తరుణోపాయం తెల్పుమని కోరగా అగస్త్యుని వేడుకొమ్మన్నాడు బ్రహ్మ. ఇంద్రుడు అగస్త్యుని ప్రార్థింపగా అగస్త్యుడు సముద్రోదకమాను హస్తమందు ఉంచుకొని పానము చేసేశాడు. అంత వృత్రాసురుడు బయల్పడగా ఇంద్రుడు ఆతనిని సంహరించాడు.

ఒకప్పుడు నహుషుడు ఇంద్రపదవి పొంది గర్వాంధకారంతో అగస్త్యాదిమునులను (సప్తర్షులను) పిలిచి తానెక్కిన పల్లకిని మోయమన్నాడు. అందు నహుషుని దుష్కార్యాలను సహించలేక అగస్త్యుడు నహుషుడిని సర్పము కమ్మని శపించాడు.



అగస్త్యుడొకమారు దక్షిణకాశిని దర్శింపవచ్చి అచ్చట నది లేకుండుట జూచి శివుని ప్రార్థించి ఆకాశగంగను అచ్చటికి తెప్పించాడు. అది సువర్ణచ్ఛాయలతో, ధ్వనులతోను ఉండుటచే ఆ నదికి సువర్ణముఖి అనీ, సువర్ణముఖరి అనీ పేర్లు కలిగాయి.



ఈ విధంగా అగస్త్యుడు తన తపశ్శక్తితో అనేక అద్భుతాలను చేసి లోకాలను రక్షించాడు. ఇదంతా ఎంతో ఏకాగ్రతతో, నిశ్చలమనస్సుతో చేసిన తపశ్శక్తివల్లనే సాధించాడు అగస్త్యుడు.

# కొల్హాపుర నాయకి శ్రీమహాలక్ష్మి

- శ్రీ ఎం.రామక్రిష్ణ

మన దేవాలయాలు

'శ్రీ' అనగా సిరులను కురిపించే 'శ్రీమహాలక్ష్మి' అని అర్థం. 'శ్రీ' అనగా లక్ష్మిని నివాసంగా కల్గిఉంటాడు కనుక 'శ్రీనివాసుడు' అయినాడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి. సమస్తచరాచరవిశ్వమంతా శ్రీమహాలక్ష్మీదేవియొక్క స్వరూపమే నని అనేకవిధాలుగా అనేకచోట్ల లక్ష్మీదేవి కీర్తింపబడింది. శ్రీమహావిష్ణువు అవతరించినప్పుడల్లా, ఆ స్వామివారి దేవేరిగా, పట్టమహిషిగా శ్రీమహాలక్ష్మి అవతరించిన సందర్భాలు అనేకం.

భృగుమహర్షి పరీక్షవల్ల కలిగిన శ్రీమహాలక్ష్మి శ్రీవైకుంఠాన్ని వదలిపెట్టి భూలోకంలో ఉన్న కొల్హాపుర క్షేత్రానికి చేరుకొంది. ఈక్షేత్రంలో కొల్హాసురుడు, కరవీరుడు అనే రాక్షసులను సంహరించి కొల్హాపురనివాసిని, కరవీరపురని వాసినిగా పేరొందింది. ఈ క్షేత్రంలో సాక్షాత్తూ శ్రీమహాలక్ష్మిగా పూజలందుకుంటోంది.

ఆ తర్వాత శ్రీవైకుంఠంనుండి మహాలక్ష్మిని వెదుకుతూ భూలోకానికి చేరుకొన్న శ్రీమహావిష్ణువు 'శ్రీవేంకటేశ్వరుడు'గా వేంకటాచలక్షేత్రంలో స్థిరపడ్డాడు. ఆ స్వామి 'శ్రీమహాలక్ష్మి' అనుగ్రహంకోసం కొల్హాపురంలో పదిసంవత్సరాలపాటు తపస్సు చేశాడు. కానీ, అక్కడ ప్రత్యక్షం కాలేదు లక్ష్మి.



అప్పుడు అశరీరవాణి చెప్పినట్లు శ్రీవేంకటేశ్వరుడు స్వర్ణ ముఖీనదీతీరాన పద్మసరోవరంచెంత పన్నెండేళ్లపాటు తపస్సు చేశాడు. ఆ తపస్సుకు శ్రీమహాలక్ష్మి పద్మసరోవరంలో సహస్ర దళాలు కలిగిన బంగారుపద్మంలో అలమేలుమంగమ్మ, పద్మా వతి అనే పేర్లతో అవతరించి, శ్రీ వేంకటేశ్వరుని చేరుకొని, శ్రీ స్వామివారిని లక్ష్మీసుసంపన్నుణ్ణి చేసింది.

## స్థలపురాణం

శ్రీమహాలక్ష్మి అలిగి పాతాళం చేరుకొని అక్కడ తపస్సు చేసుకుంటూ కాలం గడుపుతోంది. అప్పుడు అగస్త్యాది మహర్షు లందరూ అక్కడికి వెళ్లి, తపస్సు చేసుకుంటోన్న శ్రీమహాలక్ష్మిని సందర్శించి ఇలా ప్రార్థించారు. అమ్మా! పద్మావతపురమనీ, యక్షాలయమనీ, శివాలయమనీ, దక్షిణకాశియనీ, (దక్షయజ్ఞ సమయంలో సతీదేవియొక్క నేత్రాలుపడిన దివ్యక్షేత్రం) కర వీరపురమనీ, అంతటి ప్రసిద్ధిపొందిన కరవీరపురం అనే ఈ క్షేత్రంలో అర్చామూర్తిగా వెలసి భక్తులను అనుగ్రహించు తల్లీ అని ఎంతగానో ప్రార్థించారు. వారి ప్రార్థనలకు ప్రసన్నయై 'శ్రీమహాలక్ష్మి' కరవీరపురంలో అర్చారూపంలో కేవలం కొన్ని కళాంశలతో మాత్రమే కొలువై ఉంటూ భక్తులను అనుగ్రహి స్తూంది.

## కొల్హాపురం, కరవీరపురం అనే పేర్లెలా వచ్చాయి?

పూర్వం బ్రహ్మదేవుడు గయాసురుడు. లవణాసురుడు, కొల్హాసురుడు అనే ముగ్గురిని తన మానసపుత్రులుగా పుట్టించాడు. ఆ ముగ్గురూ రాక్షసప్రవృత్తితో జన్మించారు. అలా వారుచేసే ఆగడాలను భరించలేక విష్ణువు గయాసురుణ్ణి, లవణాసురుణ్ణి సంహరించాడు. ఇక కొల్హాసురుడు మాత్రమే మిగిలాడు.

తన అన్నలను చంపినకారణంగా కొల్హాసురుడు విష్ణువుపై, దేవతలపై పగపెంచుకొన్నాడు. వీళ్లందరినీ తపస్సు ద్వారానే జయించవచ్చని తలచాడు. తాను పరిపాలిస్తున్న పద్మావతపురాన్ని తనపుత్రులకు అప్పచెప్పి తపస్సుకు వెళ్లి పోయాడు. అప్పుడు శత్రురాజైన 'సుకేశి' దండెత్తివచ్చి కొల్హాసురుని పుత్రుల్ని వధించి రాజ్యాన్ని ఆక్రమించుకొన్నాడు.

అలా సుకేశి దేవతలను నానారకాలుగా హింసించి బాధపెట్ట సాగాడు. అప్పుడు దేవతలు వీడికన్నా ఆ కొల్హాసురుడే నయం కదా అని కొల్హాసురుడి రాకకోసం ఎదురుచూడసాగారు. ఇంతలో బ్రహ్మదేవునిచేత వరాలన్నీపొంది తిరిగి రాజ్యాని కొచ్చాడు. కానీ సుకేశి తన బిడ్డలనందరినీ చంపేశాడని విని కోపంతో సుకేశినిని, అతని పుత్రులను, బంధువులను, అందరినీ సంహరించి రాజ్యాన్ని కైవసం చేసుకొన్నాడు. కానీ దేవతలపై పగమాత్రం తగ్గలేదు. ఎన్నోసార్లు దేవతలపై దండెత్తినా కూడా వారిని ఏమీ చేయలేకపోయాడు. అందుకు కారణమేమై ఉంటుందా అని ఎంతో ఆలోచించాడు.

అప్పుడు తెలిసింది కొల్హాసురుడికి. సాక్షాత్తు శ్రీమహాలక్ష్మియే వైకుంఠంనుండి దిగివచ్చి తన రాజధాని పద్మావతపురం (కొల్హాపురం)లోనే కొలువై ఉన్నదనీ, ఆ తల్లి దయవల్లే దేవతలందరూ రక్షింపబడుతున్నారనీ, అందువల్లనే దేవతలను ఏమాత్రమూ జయించలేకపోతున్నాననీ గ్రహించాడు. ఆ దేవతలకు శ్రీమహాలక్ష్మి అండలేకుండా చెయ్యాలని అందుకు తపస్సే మార్గమని ఎంచాడు. అనుకున్నదే తడవుగా తన రాజ్యాన్ని 'కరవీరుడు' అనే తన పుత్రునికి అప్పగించి తపస్సుకు వెళ్లి పోయాడు. శ్రీమహాలక్ష్మిగురించి ఘోరమైన తపస్సు చేశాడు. ఆ తపస్సుకు ఆ తల్లి ప్రత్యక్షమై వరం కోరుకో మన్నది. అందుకు కొల్హాసురుడు అమ్మా! జగజ్జననీ! ఒక వందసంవత్సరాలపాటు పద్మావతపురాన్ని విడిచిపెట్టి ఎక్కడికైనా వెళ్లిపో. నా రాజ్యంలో మాత్రం ఉండకు అని వరమడిగాడు. అప్పుడు మహాలక్ష్మి ఆ రాజ్యాన్ని వదలి పెట్టి వెళ్లిపోయింది. ఆ తర్వాత వయసైపోవటంవల్ల తన రాజ్యాన్ని తిరిగీ కరవీరుడనే పుత్రునికి అప్పగించి తపస్సుకు వెళ్లిపోయాడు కొల్హాసురుడు.

తండ్రికంటె పుత్రుడింకా కర్కోటకంగా దేవతలపై దండెత్తి వారిని బాధించసాగాడు. అప్పుడు శివుడే వాణ్ణి సంహరించాడు. అలా వాడు మరణించేటప్పుడు శివుణ్ణి ఈ పురం నాపేరుతోనే పిలువబడేట్లు వరం అడిగాడు. అందుకు అనుగ్రహించాడు శివుడు. అప్పటి నుండి అది 'కరవీరపురం' అని పిలువబడింది.

ఆ విషయం తెలుసుకున్న కొల్హాసురుడు తన ధర్మమార్గాన్ని వదలి అధర్మమార్గంలో దేవతలను పీడించ సాగాడు. అప్పుడు శ్రీమహాలక్ష్మి దేవతలతో వాణ్ణి వంద సంవత్సరాలవరకు ఎవ్వరూ ఏమీచెయ్యలేరని, అంతవరకూ ఓపిక వహించండని చెప్పింది. అలా కాలగమనంలో వందేళ్లు గడచిపోయాయి. ఆ వందేళ్లకాలం పూర్తవగానే శ్రీమహాలక్ష్మి కొల్హాసురుణ్ణి వధించింది. అప్పుడు లక్ష్మీదేవిని మరణ సమయంలో అమ్మా! లక్ష్మీదేవీ! ఈ క్షేత్రం 'కొల్హాపురం' అని నా పేరుతోనే ప్రసిద్ధిపొందేట్లు అనుగ్రహించమ్మా. నువ్వుకూడా ఇక్కడే కొలువుండి భక్తుల కోరికలను అనుగ్రహించి కాపాడు తల్లీ అని వరమడిగాడు. ఆనాటినుండి కొల్హాపురం సాధనా క్షేత్రంగా, సిద్ధిక్షేత్రంగా ప్రసిద్ధికెక్కింది. అలా అక్కడ కళాంశలతో కొలువై ఉన్నది శ్రీమహాలక్ష్మి.

## శ్రీమహాలక్ష్మి

గర్భగుడిలో అమ్మవారి విగ్రహం సుమారు ఆరడుగుల చదరంగా ఉన్న ఎత్తైన వేదికమీద రెండడుగుల పీఠముంది. దానిమీద మహాలక్ష్మి కూర్చొని ఉన్న భంగిమలో ఉన్నది. చతుర్భుజాలున్నాయి. నాల్గుచేతుల్లో పండు, గద, డాలు, పానపాత్ర ఉంటాయి. మూడడుగుల ఎత్తులో ఉన్నది మూల మూర్తి. అనేక ఆభరణాలతో చాలా అందంగా, ఆకర్షణీయంగా ఉన్నది. అమ్మవారి మూలమూర్తి వెనుక సింహవాహనమున్నది.



## శ్రీమహాలక్ష్మీ శ్రీనివాసుడు

**శ్రీనివాసుని హృదయంమీద మాత్రమేకాక 'అష్టలక్ష్ములు'గా స్వామి శరీరమంతా ఆక్రమించి ఉన్నది శ్రీమహాలక్ష్మి. అవి- ముఖంలో 'భాగ్యలక్ష్మి'గా; రెండుచేతుల్లో 'దానలక్ష్మి'గా; రెండుభుజాల్లో 'వీరలక్ష్మి'గా; హృదయకమలంలో 'భూత కారుణ్యలక్ష్మి'గా; నందకఖడ్గాగ్రంలో 'శౌర్యలక్ష్మి'గా; గుణగణాల్లో 'కీర్తిలక్ష్మి'గా; సర్వాంగాల్లో 'సౌమ్యలక్ష్మి'గా; శాంత స్వరూపంలో 'సర్వసామ్రాజ్యలక్ష్మి'గా శ్రీనివాసుని శరీరమంతటా పాదాలనుంచి హృదయంవరకు 'అష్టలక్ష్ములు'గా ఆయా స్థానాల్లో కొలువై ఉన్నందువల్లే స్వామి 'శ్రీమహాలక్ష్మీ శ్రీనివాసుడు' అనే పేరును సార్థకం చేసుకొన్నాడు.**

మూలవిరాట్టు పశ్చిమముఖంగా ఉంటుంది. సంవత్సరానికి రెండు, మూడుసార్లు మూడురోజులపాటు సూర్యాస్తమయ సమయంలో సూర్యునికిరణాలు పడమటిదిక్కులో ఉన్న చిన్న కిటికీగుండా అమ్మవారిముఖాన్ని తాకుతాయి. ఈ ప్రత్యేక దర్శనానికి భక్తులు అధికసంఖ్యలో వస్తారు. గర్భగుడిగోడపై శ్రీచక్రం ఉండటం ఇక్కడ ప్రత్యేకం. మొదట ఒక్క మహాలక్ష్మియే ప్రతిష్ఠింపబడింది. తర్వాత 11వశతాబ్దంలో గండిరాదిత్య హయాంలో ప్రదక్షిణబాట, మహాకాళీ, మహాసరస్వతీ ప్రతిష్ఠలు జరిగాయి. మూలవిరాట్‌కి, మహాకాళికి మధ్య మహాలక్ష్మి యంత్రం ప్రతిష్ఠింపబడింది.

### ఆలయ నిర్మాణశైలి

శ్రీమహాలక్ష్మీదేవికి ప్రత్యేకించి ఉన్న ఆలయాల్లో కొల్హాపుర్ ఆలయం ప్రసిద్ధమైనది. ఈ ఆలయం మహారాష్ట్రలోని కొల్హాపుర్‌లో పంచగంగనది ఒడ్డున ఉన్నది. ఇది సుమారు ఆరువేలసంవత్సరాలనాటి ఆలయం. ఎందరో రాజులు దీన్ని



నిర్మించారు. ఇది విశాలప్రాంగణంలో హేమాడ్‌పంత్‌శైలిలో, శిల్పకళానైపుణ్యంతో నిర్మింపబడింది. నాలుగుదిక్కుల్లో ముఖ ద్వారాలున్నాయి. ఐదుగోపురాలక్రింద ఆలయం ఉంది. నాలుగు దిక్కులా నాలుగుగోపురాలు, మధ్యలో ఒకగోపురం ఉన్నాయి. అందులో తూర్పుగోపురంక్రింద శ్రీమహాలక్ష్మి ఉన్నది. మధ్యలో కుమారమండపం, పడమర గణపతి, ఉత్తరంన మహాకాళి, దక్షిణంన మహాసరస్వతి కొలువుతీరి ఉన్నారు. ఉపాలయాల్లో శ్రీవేంకటేశ్వరస్వామి, నవగ్రహాలు, రాధాకృష్ణ, కాలభైరవ, వినా యకుడు, సింహవాహిని, తుల్జాభవాని మొదలైన అనేక దేవత లున్నారు.

### పూజలు, ఉత్సవాలు

ఇక్కడ మహాలక్ష్మి అమ్మవారికి ప్రతిరోజూ ఐదుసార్లు అర్చన జరుగుతుంది. ఉదయం 5గం॥లకు సుప్రభాతసేవ చేస్తారు. కాకడహారతి ఇస్తారు. ఉదయం ఎనిమిదిగంటలకు షోడశోపచారపూజ చేస్తారు. మధ్యాహ్నం, సాయంత్రాల్లో పూజ, శేజ్‌హారతి జరుపుతారు. ప్రతిశుక్రవారం ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. చైత్రమాసంలో వచ్చే పౌర్ణమితోపాటుగా నవ రాత్రుల్లో అమ్మవారికి వేడుకలు జరుపుతారు. ప్రతి శుక్రవారం సాయంత్రాల్లో పౌర్ణమినాడు అమ్మవారిని ఆలయం వెలుపల ఊరేగిస్తారు.

హైదరాబాదునుంచి 540కి.మీదూరంలో ఉన్న కొల్హాపూర్‌కి బస్సు, రైలురవాణాసౌకర్యాలున్నాయి. ఇంతటి విశేషప్రసిద్ధి, ప్రాశస్త్యమున్న కొల్హాపురం శ్రీమహాలక్ష్మిని దర్శించి అమ్మవారి కృపాకటాక్షాలు పొందుదాం. ఆ చల్లనితల్లే తిరుచా నూరులో పద్మావతీదేవిగ ఆవిర్భవించిన కారణంగా శ్రీపద్మావతి అమ్మవారిబ్రహ్మోత్సవాల్లో అమ్మవారిని కూడా దర్శించి పునీతుల మవుదాం.

# ఆయన దృష్టిలో.. అందరూ ఒకటే!!

– డా॥ దేవులపల్లి పద్మజ, 98496 92414

సకలజీవులను స్మరణమాత్రంచే భయభ్రాంతులకు గురిచేసే గ్రహరూపం శ్రీశనీశ్చరుడు. ఈయన కృపాకటాక్షవీక్షణములు గలిగిన వ్యక్తి. తిరుగులేని వ్యక్తిగా ఉంటాడని ప్రతీతి. ఈయన అనుగ్రహం లేకపోతే జాతకచక్రంలో ఎన్నిగ్రహములు అనుకూలంగా ఉన్నప్పటికీ అనేకకష్టాలు అనుభవించవలసి వస్తుంది. జ్యోతిషశాస్త్రప్రకారం శ్రీశనీశ్చరుడు స్వతంత్రంగా ఫలితాలు ఇవ్వగలిగిన అత్యంత ప్రభావవంతమైన గ్రహం. నవగ్రహాలలో ఈయన యువరాజు.

లోకానికి ప్రత్యక్షదైవం అయిన శ్రీసూర్యునికి, ఛాయ దేవికి జన్మించిన కుమారుడు శ్రీశనీశ్చరుడు. ఈయన విభవ నామసంవత్సరంలో మాఘమాసం బహుళచతుర్దశినాడు భరణి నక్షత్రంలో కాశ్యపసగోత్రంలో జన్మించాడు. ఈయన నీలవర్ణం కలిగి ఉండి, నలుపు లేదా నీలవస్త్రాలు ధరించి, గ్రద్ద వాహనంగా, నాలుగుచేతులతో, శూలమును ఆయుధంగా ధరించి, యముడు అధిదేవతగాను, ప్రజాపతి ప్రత్యధిదేవత గాను, యమునకు సోదరుడుగాను కలిగి ఉండి జ్యోతిర్మండలంలో సంచరిస్తూ జీవుల స్థితిగతులను, కర్మఫలితాలను నిర్ణయిస్తూ ఉంటాడు. ఈయన తమోగుణప్రదానుడు.

తల్లిగర్భంలో ఉండగా, సూర్యుని ప్రచండవేడివల్ల ఆయన దేహమంతా నల్లగా మారిపోయింది. అందువల్లనే ఈయన రంగు నీలం లేదా నలుపువర్ణంలో ఉంటుంది. ఈయన దృష్టిలో ఎటువంటి బేధభావములు ఉండవు. మహారాజైనా, బికారైనా సమానంగా దృష్టి కలిగి ఉంటాడు. ఈయనను మందగామి అని పిలుస్తారు. ఆయుష్షును ఇచ్చే శ్రీశనీశ్చరుడి అనుగ్రహం పొందుటకు ధర్మాచరణమే ఉత్తమమార్గం. అనుగ్రహం, ఆగ్రహం రెండు శ్రీశనీశ్చరుడిపరిధిలో అధికంగానే ఉంటాయి. అనుగ్రహదశలో ఊహాతీతమైన అభివృద్ధి, ఆగ్రహదశలో అథఃపాతాళానికి నెట్టివేయటం రెండూ ఆయన






వల్లనే జీవితంలో సంభవిస్తాయి. కారణం లేకుండా ఆగ్రహించని సున్నితమైన మనసు శ్రీశనీశ్చరుడిది.

బ్రహ్మాండపురాణంలో ఈయన గురించి ఒక కథ ఉంది. సహజంగా శ్రీశనీశ్చరుడు శ్రీకృష్ణునిధ్యానంలో నిమగ్నుడై ఉంటాడు. ఒకరోజు ఆయన ధ్యానంలో ఉండగా ఈయనభార్య సంతానంకోసం తన భర్తదగ్గరికి చేరింది. కాని ఆయన తన భార్యను గుర్తించలేదు. దానితో ఆయన భార్య కోపించి, ఈయనదృష్టి సోకితే చెడుఫలితాలు కలుగుతాయని శపించింది.

కొద్దిసేపటికి శ్రీశనీశ్చరుడు ధ్యానంనుండి బయటకు వచ్చి, జరిగింది తెలుసుకుని తన ధ్యానవిషయాన్ని భార్యకు వివరించాడు. నిజం తెలుసుకున్న భార్య పశ్చాత్తాపం చెందింది. కాని తాను ఇచ్చిన శాపం మరలించలేకపోయింది. అప్పటినుంచి శ్రీశనీశ్చరుని దృష్టి చెడుఫలితాన్ని ఇవ్వటం ప్రారంభమైందట. అప్పటినుంచి ఆయన తన దృష్టి కొద్దిగా వంచి అమాయకులను రక్షించటానికి గమనం సాగిస్తాడని ప్రతీతి.

శ్రీశనీశ్చరునికి ప్రసిద్ధిచెందిన మరియు అత్యంత మహిమాన్వితమైన పది నామాలున్నాయి. అవి కోణ, మంద, కృష్ణ, సూర్యపుత్ర, యమ, పంగు, శనైశ్చర, సౌరి, కాల మరియు ఛాయాసుత. ఈ నామాలను భక్తిశ్రద్ధలతో పఠిస్తే శనైశ్చర అనుగ్రహం తప్పక కలుగుతుంది.

శ్రీశనీశ్చరుడు కర్మప్రదాత. అందరూ భావించినట్లు ఈయన చెడుఫలితాలను ఈయడు. జీవియొక్క కర్మఫలాలను అనుభవించేటట్లు చేసి కర్మ బంధాలనుండి విముక్తుని చేస్తాడు. పరమేశ్వరుని తర్వాత ముక్తిని ఈయగల శక్తిమంతుడు శ్రీశనీశ్చరుడే. ధర్మబద్ధమైన జీవనం గడిపేవారికి కష్టాలు ఆరంభంలో కలిగినా, తదనంతర కాలంలో అద్భుతమైన ఫలితాలు ప్రాప్తమౌతాయి. జాతకుని జన్మకుండలిలో జన్మరాశి నుండి 12, 1, 2 స్థానాలలో ఈయన సంచారం చేస్తున్నప్పుడు ఏలిననాటి శనిదశయని, 4వస్థానంలో సంచరిస్తున్నప్పుడు అర్ధాష్టమశనిదశయని, 8వస్థానంలో సంచరిస్తున్నప్పుడు అష్టమశనిదశయని వ్యవహరిస్తారు. ఈయన సూర్యునిచుట్టూ తిరిగిరావటానికి 30సంవత్సరాలకాలం పడుతుంది. అందువలనే ఈయనను మందగామి అంటారు.

సాధారణంగా ప్రతిమనిషి జీవితంలో రెండు లేదా మూడుసార్లు ఏలిననాటి శనిదశ వస్తుంది. అందులో ఒక్కొక్క భాగము 2సంవత్సరాలుగా విభజిస్తే ఒకభాగం అధమ లేక నీచస్థితి, మరొకభాగం సాధారణ లేక మధ్యమస్థితి, మూడవ భాగం ఉన్నతస్థితిలోనూ నడుస్తుంది. ఇటువంటి దశలలో నిరాశ, నిస్పృహలకు లోనుగాకుండా విపరీతనిర్ణయాలు తీసుకోకుండా చిన్న చిన్న పరిహారాలతో శ్రీశనీశ్చరుని అనుగ్రహం పొందవచ్చు. అవి ప్రతి శనివారం శివాలయంలో ఉమ్మెత్త పువ్వులు సమర్పించటం, నవగ్రహఆలయంలో 19 ప్రదక్షిణలు చేయటం, "ఓం శం శనైశ్చరాయ నమః" అను మంత్రమును జపం చేసుకోవటం, వృద్ధులకు సేవ చేయటం, నువ్వులు బెల్లం కలిపిన ఉండలు పిల్లలకు పంచటం, మంగళవారం పేద దంపతులకు ఎండుఖర్జూరం దానం చేయటంవంటి కార్యక్రమాలు శ్రీశనీశ్చరుని అనుగ్రహం పొందటంలో సహాయం చేస్తాయి. మరీ కష్టమైనస్థితిలో ఉన్నవారు ఎనిమిది శనివారాలు ఒక ఇనుపప్రమిదలో నూపప్పునూనె పోసి, ఒక నల్లనివస్త్రంలో కొన్ని నల్లనువ్వులు మూటకట్టి దానిని వత్తిలా చేసి, దానిని ప్రమిదలో పెట్టి, శివాలయంలోని శ్రీశనీశ్చరుని ఎదుట వెలిగించాలి. నువ్వులనూనెతో శ్రీశనీశ్చరునికి తైలాభిషేకం చేయటం కూడా ఉత్తమం. ఆయన పాదాలవద్ద నువ్వులు ఉంచి, ఒక ఆకులో బెల్లం, నువ్వులు నైవేద్యం పెట్టి, తమ సమస్యలను విన్నవించుకుని విముక్తి కలిగించుమని వేడుకోవటంవల్ల కూడా అతి శీఘ్రంగా మంచి ఫలితాలనిస్తుంది.

## శని గ్రహస్తోత్రం

**నీలాంజన సమాభాసం రవిపుత్రం యమాగ్రజం ।**
**ఛాయామార్తాండ సంభూతం తం నమామి శనైశ్చరం ॥**

శ్రీశనైశ్చరులు నిత్యవైరాగ్య భావంతో, తపోదృష్టితో, నిత్యసంతృప్తిగా, శాంతమూర్తిగా, మహాయోగిగా, శుచిప్రియునిగా, ధర్మపరునిగా, కర్మబంధాలకు అతీతుడుగా విలసిల్లుతూ ఉంటాడు. ఈయన అనుగ్రహం పొందటానికి ఎంతటి కష్టమైనా ధర్మాచరణానికి మించిన తరుణోపాయం లేదు.

మహారాష్ట్రలోని శనిశింగనాపూర్‌క్షేత్రంలో సాక్షాత్తు శ్రీశనీశ్చరులు కొలువై ఉన్నారని భక్తులు విశ్వసిస్తారు. అక్కడ ఒక నల్లనిరాయిరూపంలో స్వామివారు దర్శనమిస్తారు.

ఈయన పరమాత్మ అంశ కూర్మావతారం కావటం వలన, కూర్మావతార ధ్యానశ్లోకాలు మంచి ఫలితాలను కలుగచేస్తాయి. ఈయనను ప్రసన్నం చేసుకునేందుకు దశరథ ప్రోక్త శనిస్తోత్రం, శనికవచస్తోత్రం, ఉమామహేశ్వరస్తోత్రం, హనుమాన్‌చాలీసా, కాలభైరవాష్టకం మొదలైనవి ప్రముఖమైనవి.

ఓం శం శనయే నమః


తన విధిని తాను నిర్వహిస్తూ ఇతరుల పనుల్లో జోక్యం చేసుకోకపోవడమే ధర్మం

# తిరుమల తిరుపతి దేవస్థానములు





సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనన్దనః।
పార్థోవత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్॥



30-10-2021న మహతిసభామందిరంలో జరిగిన **గోమహాసమ్మేళనం**లో జ్యోతిప్రజ్వలన గావిస్తున్న
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.యస్.జవహర్‌రెడ్డి, ఐ.ఏ.ఎస్.
ఇందులో తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి
మరియు తి.తి.దే. ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





గోమాతకు గ్రాసనివేదన చేస్తున్న కంచికామకోటి పీఠాధిపతి జగద్గురువు
శ్రీశ్రీశ్రీ శంకరవిజయేంద్రసరస్వతి స్వామీజీ



31-10-2021న గోమహాసమ్మేళనంలో ప్రసంగిస్తున్న
తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి.
అందులో పాల్గొన్న పీఠాధిపతులు, మఠాధిపతులు

# తిరుమల తిరుపతి దేవస్థానములు



గోమహాసమ్మేళనంలోని ఒకస్టాల్‌లో అరటిగెలలను వీక్షిస్తున్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.యస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్.



31-10-2021న గోమహాసమ్మేళనంలో అనుగ్రహభాషణం చేస్తున్న పీఠాధిపతులు, మఠాధిపతులు





తిరుపతి మహతి కళామందిరంలో జరిగిన గోమహాసమ్మేళనంలో ఏర్పాటు చేసిన వివిధస్టాళ్లను సందర్శించిన
తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి,
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.యస్.జవహర్‌రెడ్డి, ఐ.ఏ.ఎస్.



గో సంబంధిత కిట్‌ను
విశ్రాంత ఐ.ఏ.ఎస్. అధికారి శ్రీవిజయ్‌కుమార్ గారికి అందజేస్తున్న
తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి (తిరుపతి)
శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్.



పంచగవ్య ఉత్పత్తులను పరిశీలిస్తున్న
తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి,
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.యస్.జవహర్‌రెడ్డి, ఐ.ఏ.ఎస్.



# గోవిందుని సాక్షిగా.. గోమహాసమ్మేళనం!!

– శ్రీ కె. శివకుమార్,
తి.తి.దే. పాలకమండలి
మాజీ సభ్యులు

గోరక్షణే ధర్మరక్షణ నినాదంతో తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో అక్టోబర్ 30, 31 తేదీల్లో తిరుపతి మహతికళాక్షేత్రంలో గోవిందునిసాక్షిగా గోమహాసమ్మేళనం కార్యక్రమం నభూతో నభవిష్యతి అన్నరీతిలో అత్యంతవైభవంగా జరిగింది.

యుగతులసి ఫౌండేషన్ మరియు శ్రీగోధామ్‌పత్ మేడ, రాజస్థాన్ సౌజన్యంతో దేశం నలుమూలలనుండి విచ్చేసిన జగద్గురువులు, పీఠాధిపతులు, మఠాధిపతులు, స్వామీజీలసమక్షంలో జరిగిన గోమహాసమ్మేళనం గోరక్షణ, సంరక్షణ కర్తవ్యానికి సరికొత్త దిశానిర్దేశం చేసింది.

తొలిరోజు సేవ్‌ఫౌండేషన్ అధ్యక్షులు, గోఆధారిత వ్యవసాయ మహర్షి శ్రీవిజయ్‌రామ్ నేతృత్వంలో వెయ్యిమందికి పైగా రైతులతో గో ఆధారిత వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం జరిగింది.

తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వీ.సుబ్బారెడ్డి అమృతహస్తాలమీదుగా ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఉభయ తెలుగురాష్ట్రాల్లో గోఆధారిత వ్యవసాయం చేస్తున్న ఔత్సాహికరైతులు, వ్యవసాయనిపుణులు తమ అనుభవాలను, ఆలోచనలను కలబోసుకున్నారు.
















తొలుత మహతికళాక్షేత్రం ప్రాంగణంలో పదులసంఖ్యలో ఏర్పాటు చేయబడ్డ గో ఆధారిత వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన స్టాళ్ళను తిరుమలతిరుపతిదేవస్థానముల పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వీ.సుబ్బారెడ్డి ప్రారంభించారు. పూర్తి సంప్రదాయపద్ధతిలో, గోఆధారితవిధానంలో పండించిన అనేకవ్యవసాయఉత్పత్తులు, గోఆధారిత పంచగవ్యఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు.

తొలుత సమావేశాన్ని ఉద్దేశించి అధ్యక్షోపన్యాసం చేసిన తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వీ.సుబ్బారెడ్డి గోఆధారిత వ్యవసాయానికి తి.తి.దే. పెద్దపీట వేస్తుందని, గుడికి ఓ గోమాత, గో ఆధారిత నైవేద్యం, నవనీతసేవవంటి అనేక వినూత్న కార్య క్రమాలతో తి.తి.దే. గోరక్షణకు కృషి చేస్తుందని చెప్పారు. గోఆధారిత వ్యవసాయంద్వారా పండిన ఉత్పత్తులనే శ్రీవారి నైవేద్యానికి వినియోగిస్తామని, గోఆధారితవ్యవసాయరైతులతో ఒప్పందం చేసుకోవడమేగాక మార్కెట్‌కన్నా ఎక్కువ ధర ఇచ్చి వ్యవసాయఉత్పత్తులను కొనుగోలు చేస్తామని శ్రీ వై.వీ.సుబ్బారెడ్డి రైతుల హర్షధ్వానాలమధ్య ప్రకటించారు. తి.తి.దే. కార్యనిర్వహణా ధికారి శ్రీ డా॥ కే.ఎస్.జవహర్‌రెడ్డి, గోరక్షణ, సంరక్షణకు తి.తి.దే. చేపట్టిన చర్యలను వివరించారు.

ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాతా నిర్మలానంద యోగ భారతిజీ గోరక్షణ ఆవశ్య కతను, అన్నదాతఔన్నత్యాన్ని వివరించారు. ఉభయ












తెలుగురాష్ట్రాలనుండి వచ్చిన అనేకమంది అన్నదాతలు గోఆధారిత వ్యవసాయం గురించి తమ అనుభవాలను పంచుకున్నారు. సేవ్ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీ విజయరామ్‌తో పాటు అనేకమంది లబ్ధప్రతిష్ఠులైన వ్యవసాయనిపుణులు, శాస్త్రవేత్తలు గోఆధారిత వ్యవసాయవిధానాలను, మెళకువలను రైతులకు సోదాహరణంగా వివరించారు.





కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్రసరస్వతి ముఖ్యఅతిథిగా, అతిరథమహారథుల సమక్షంలో గోమహాసమ్మేళనం రెండోరోజు ముగింపు సమావేశం అక్టోబర్ 31వతేదీ సాయంత్రం కన్నులపండువుగా ప్రారంభమైంది. తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వీ.సుబ్బారెడ్డి మాట్లాడుతూ తెలుగురాష్ట్రాల్లోని గోశాలలను శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలతో అనుసంధానం చేసి గోవులపోషణకు ఆర్థికసహాయం అందిస్తామని సభికుల హర్షధ్వానాలమధ్య ప్రకటించారు. తి.తి.దే. గోమహాసమ్మేళనం కేవలం ఆరంభం మాత్రమేనని రాబోయేరోజుల్లో జిల్లాలవారీగా ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు. తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ డా॥ కే.ఎస్.జవహర్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగురాష్ట్రాల్లో 600కు పైగా గోశాలలను అభివృద్ధి చేయడానికి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. గోఆధారిత వ్యవసాయమే ప్రపంచానికి దిక్కు అని తీర్మానం చేసి ఐక్యరాజ్యసమితికి పంపాలని తిరుపతి పట్టణ శాసనసభ్యులు శ్రీ భూమన కరుణాకర్‌రెడ్డి సూచించారు. ప్రకృతివ్యవసాయంతో ప్రపంచ ఆహారసమస్యను పరిష్కరించవచ్చని విశ్రాంత ఐ.ఏ.ఎస్., అధికారి శ్రీవిజయ్‌కుమార్ తెలిపారు. గోమాత విశిష్టతను తెలియజేస్తూ జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు రచించిన గోమాత గీతాన్ని తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు, కార్యనిర్వహణాధికారులు ఆవిష్కరించారు.




















యుగతులసిఫౌండేషన్ అధ్యక్షులు, తి.తి.దే. పాలక మండలి మాజీసభ్యులు శ్రీ కె.శివకుమార్ మాట్లాడుతూ గోరక్షణ చేసిన గోవిందుడిబాటలో తిరుమల తిరుపతి దేవస్థానములు గోవిశిష్టతను విశ్వవ్యాప్తం చేసే బాధ్యతను తీసుకున్నందుకు అభినందనలు తెలియజేశారు. గుడికి ఓ గోమాత, గోఆధారిత నైవేద్యం, నవనీతసేవవంటి అనేక విశిష్టకార్యక్రమాలు చేపట్టడమే కాక గోవును జాతీయప్రాణిగా ప్రకటించాలనే చారిత్రక తీర్మానాన్ని కూడా తి.తి.దే. చేసిందని శ్రీ శివకుమార్ గుర్తుచేశారు. గో మహాసమ్మేళనం కార్యక్రమాన్ని కూడా నభూతో నభవిష్యతి అనేరీతిలో నిర్వహించిన తి.తి.దే.కు కృతజ్ఞతలు తెలియజేశారు. గోవును జాతీయప్రాణిగా ప్రకటించాలని కేంద్రానికి విన్నవించు కుంటూ సంక్రాంతి తరువాత దేశవ్యాప్త గో మహారథయాత్రకు శ్రీకారం చుడుతున్నట్టు శ్రీ శివకుమార్ ప్రకటించారు.

తి.తి.దే. పాలకమండలి ప్రతిపాదించినవిధంగా గోమాతను జాతీయప్రాణిగా ప్రకటించాలని ప్రముఖ యోగా గురువు, పతంజలి యోగపీఠం వ్యవస్థాపకులు శ్రీ బాబారాందేవ్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. దేశంలోని ముఖ్యమంత్రులందరూ తి.తి.దే. ప్రతిపాదనను చట్టం చేయడానికి సహకరించాలని కోరారు. భువనేశ్వరీపీఠం పీఠాధిపతి శ్రీకమలానంద భారతీ స్వామీజీ, ఉడిపి పెజావర్ అధోక్షజామఠం పీఠాధిపతి శ్రీవిశ్వ ప్రసన్నతీర్థ మహాస్వామీజీ, ఉత్తరాఖండ్ శ్రీ గోపాల్‌మణిమహారాజ్, ఒడిసా శ్రీ పరమహంస ప్రజ్ఞానందమహారాజ్, రాజస్థాన్‌కి చెందిన శ్రీ రాధకృష్ణజీమహారాజ్, శ్రీ గోధామ్‌మహాతీర్థ్‌పత్‌మేడ రాజస్థాన్ గౌ రుషి శ్రీ దత్ శరణానంద మహారాజ్ తదితరులు తమ గోసందేశం వినిపించారు.

అవధూత దత్తపీఠం ఉత్తరాధికారి పూజ్యశ్రీ దత్త విజయానందతీర్థస్వామీజీ, కర్ణాటక శ్రీమధుగిరి యతిరాజ నారాయణ రామానుజజీయర్‌స్వామీజీ, జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ రాఘవేశ్వర భారతీమహాస్వామీజీ, ఏర్పేడు వ్యాసాశ్రమం శ్రీ పరిపూర్ణానందగిరి స్వామీజీ తమ అనుగ్రహభాషణలు అంద జేశారు. గోమాతరక్షణకు తి.తి.దే. ప్రారంభించిన ఉద్యమం విశ్వవ్యాప్తం కావాలని ముఖ్యఅతిథి కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ శంకరవిజయేంద్రసరస్వతిస్వామీజీ ఆకాం క్షించారు. గోసంరక్షణనిర్ణయం దేశసంక్షేమానికి ఉపయోగపడు తుందని జగద్గురు వెల్లడించారు. శృంగేరీ శారదా పీఠాధిపతి శ్రీవిదుశేఖర భారతీస్వామీజీ పంపిన వీడియోసందేశాన్ని ప్రదర్శించారు. కార్యక్రమానికి ముందు జగద్గురు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్రసరస్వతిస్వామీజీ ప్రారంభించిన గోధూళికార్యక్రమం ఆహూతులను ఎంతగానో అలరించింది. కపిలగోవుకు, దూడకు స్వామీజీ ప్రత్యేకపూజలు చేశారు. కళాక్షేత్రంవద్ద ఏర్పాటుచేసిన సప్తగోజాతులప్రదర్శన గోబంధువులకు అనిర్వచనీయమైన ఆనందానుభూతిని కలిగించింది. ఉత్తరదక్షిణభారతదేశాల సంగమంగా జరిగిన గోమహాసమ్మేళనానికి హాజరైన అతిరథ మహారథులను తి.తి.దే. ఘనంగా సత్కరించింది.

గోరక్షణ, సంరక్షణలకోసం తి.తి.దే. ఇటువంటి కార్య క్రమాలు మరెన్నో చేపట్టి విజయవంతం చేయాలని, సకలదేవతా స్వరూపమైన గోవు సాధ్యమైనంత త్వరలో జాతీయహోదా సాధించాలని ఆ గోవిందుని శ్రీచరణారవిందాలను ప్రార్థిద్దాం.

*గోవిందునకు జయము జయము!*

*గోమాతకు జయము జయము!!*



# శ్రీవేంకటేశ్వర గోసంరక్షణ ట్రస్టు













గోజాతిని సంరక్షించి, హిందూమతవ్యవస్థలో వాటికి గల విశిష్టతను తేటతెల్లం చేసే సత్సంకల్పంతో తి.తి.దే. 1956లో గోసంరక్షణశాలను నెలకొల్పింది. దీనికి అనుబంధంగానే 2002వ సంవత్సరంలో '**శ్రీవేంకటేశ్వర గోసంరక్షణ ట్రస్టు**' ఏర్పాటు చేయబడింది. ఈ ట్రస్టుకు విరివిగా విరాళాలిచ్చి, పశుసంవర్ధనకు మీ సహాయ సహకారాలను అందించండి.

మీ అభీష్టంమేరకు గోశాలలోని మూగజీవులను దత్తత తీసుకుని వాటి పోషణబాధ్యతను వహించడానికి కదలిరండి.

**అధికరణం 80 (జి) క్రింద ఆదాయపుపన్ను మినహాయింపు వర్తిస్తుంది**

**: డిమాండు డ్రాఫ్ట్ / చెక్కులు పంపవలసిన చిరునామా :**

**ది డైరెక్టర్, ఎస్.వి. గోసంరక్షణ ట్రస్టు, ఎస్.వి. డైరీఫారం, తి.తి.దే., తిరుపతి - 517 502**
**ఫోన్ నెం. 0877- 2264570**

ధారావాహిక

# శ్రీమద్భగవద్గీత

- ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ

*గత సంచిక తరువాయి భాగం...*

ఆ మధ్యస్థాయిలో ఉన్నటువంటి వాడికి కూడ ఈ భగవద్గీత పనిచేస్తుంది అని తెలియజేసినట్లయింది. ధృతరాష్ట్రుడు ఈ విధంగా చూస్తే ఉన్నతస్థాయిలో ఉన్నవాడు రాజు. ఆ ఉన్నతస్థాయిలో ఉన్నటువంటి వారికి కూడ ఈ భగవద్గీతామృతం ఉపయోగిస్తుంది అని వీరి ముగ్గురిద్వారా ఇంకోరకంగ సూచన చేస్తున్నాడు.

ఇలా మనం ఏరకంగ ఆలోచించినా సరే ఏదో ఒక స్థలంలో మనం తప్పకుండ ప్రవేశిస్తాం. ప్రవేశిస్తే మనకు కూడా ఆ భగవద్గీతామృతం అందుకునే యోగ్యత పరిపూర్ణంగ ఉంటుంది. కాకపోతే ఏ స్థలంలో ప్రవేశించాలి. ఏ విభాగంలో ప్రవేశించాలి. అర్జునుని విభాగంలోనే ప్రవేశించాలి. ఏమి అర్జునునియొక్క వైశిష్ట్యం అంటే పరమాత్మనుండి సాక్షాత్తుగ ఉపదేశం పొందగలిగిన యోగ్యత ఎప్పుడో సృష్టి ఆదిలో మరీచ్యాది ప్రజాపతులకు, సనకాదులకు కలిగింది. మళ్ళీ మధ్యలో వివస్వంతుడులాంటివారికి కలిగింది. ఆ పరమాత్మ సందేశాన్ని పొందగలిగిన యోగ్యత అర్జునుడికి మాత్రమే ఉంది.

కనుక మనమందరం ఆ యోగ్యతకోసమే ప్రయత్నం చేయాలి. ఆ పరమాత్మ ప్రత్యక్షంగా ఇక్కడకు రాడు కనుక కలియుగంలో ఉండే మానవులకు ప్రత్యక్షమైతే ఏరకమైన కోరికలు కోరుతారు అనే విషయం పరమాత్మకు స్పష్టంగా తెలుసుకనుక అయన (మన దేహంగా ఉన్నట్లుగ) ఈ దేహంలో పరమాత్మ ప్రత్యక్షంగాడు. ఆ పరమాత్మ అర్చావతారమూర్తిగ తన సంకల్పంలో ఈ ఉపదేశామృతాన్ని గ్రహిద్దాం. గ్రహించి మన జీవితాలను సార్థకంగా చేసుకుందాం.

కేవలం ఈ మహారాజులు మాత్రమే యోగ్యులా? మరెవరూ యోగ్యులు కారా? మిగతావారెవరూ భగవంతుని యొక్క అనుగ్రహానికి పాత్రులు కారా? అనంటే చాలామంది మహారాజులు, వీరులు, యోద్ధలు ఇక్కడ పరమాత్మానుగ్రహానికి పాత్రులైనవారున్నారు. పరమాత్మయొక్క అనుగ్రహానికి పాత్రత పొందాలంటే నీ స్వకర్తవ్యాన్ని నిర్వహించుకోవాలి. స్వకర్తవ్య పాలన పరిపూర్ణంగ చేసేటువంటి సంకల్పాన్ని కలిగి ఉండాలి. అలాంటివారిమీదే పరమాత్మయొక్క అనుగ్రహం పరిపూర్ణంగ కలుగుతుంది.

శ్రీమద్భగవద్గీతామృతంలో శ్రీపరమాత్మ కొంతమంది వీరులపేర్లను అక్కడక్కడ నిబద్ధం చేయటంద్వారా వారిమీద తనకు కలిగిన అనుగ్రహాన్ని స్పష్టంగా సూచన చేస్తున్నారు. అయితే వారిని దుర్యోధనుడి మాటలద్వారా మనకు వినిపిస్తున్నాడు. ఆ దుర్యోధనుడు ఇలాంటి సద్వీరులమీద, సత్పురుషుల మీద ఎలాంటి అసూయను కలిగి ఉన్నాడు, దానివలన ఏరకమైన దుష్ఫలితం కలుగుతుంది అని మనందరికి తెలియజేయటంకోసం కొంతమంది. సత్పురుషులపేర్లను దుర్యోధనుడి నోటిద్వారా మనకు వినిపిస్తున్నాడు. ఆ సత్పురుషులపేర్లను క్రమంగా ఈ శ్లోకాల్లో తెలుసుకుందాం. నాలుగవశ్లోకంలో దుర్యోధనుడు ద్రోణాచార్యుడివద్ద గురువుగారిని కించ పరచటంతోపాటు ఎదురుగుండా ఉండే వీరులనుగూడ కొంత మందిని కించపరచేట్లుగ కొన్నిమాటలు మాట్లాడుతున్నాడు.

"అత్ర శూరా మహేష్వాసా భీమార్జున సమాయుధి
యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథః"

పాండవసైన్యంలో చాలామంది వీరులు, శూరులు ఉన్నారు. పెద్దపెద్దవిల్లంబులు ధరించి ఉన్నారు. ధనుస్సులు చాలా పెద్దవిగా ఉన్నాయి. అందరికి పరాక్రమం ఉంది. భీముడితో అర్జునుడితో సమానంగా ఉన్నారు. యుయుధానుడు, విరాటుడు, ద్రుపదుడు మొదలైన వీరులున్నారు. ఇందులో దుర్యోధనుని అసూయ ఏం కనిపిస్తోంది? కాస్త జాగ్రత్తగ చూస్తే 'యుయుధాన' అని మొదట అంటున్నాడు. అంటే బాగా యుద్ధం చేసేవాడు అని అర్థం. ఈ బిరుదు 'సాత్యకి' అనే కృష్ణుడి తమ్ముడి వరుస అయ్యే ఒక యాదవవీరుడికి ఉన్నది. ఎందుకు సాత్యకి పేరే ముందు ఉచ్చరిస్తున్నాడు? పాండవులలో వీరులపేర్లు చెప్పవలసి వస్తే ముందు అర్జునుడినే చెప్పాలి.

(ఇంకా ఉంది)


ధార్మికులకు ఆత్మరక్షణకన్నా ధర్మరక్షణే ముఖ్యం



# జగజ్జనని ఆవిర్భావం పంచమితీర్థం

- డా॥ పల్లం పద్మావతి

సప్తర్షులు చేసిన యాగం పూర్తయింది. ఆ యాగ ఫలం ఎవరికివ్వాలన్న విషయమై వారిమధ్య నిర్ణయం జరిగింది. త్రిమూర్తుల్లో సత్త్వగుణప్రధానుడైన వానికి ఆ యాగఫలమివ్వాలని నిర్ణయించారు. అందుకుగాను భృగుమహర్షిని కర్తగా ముల్లోకాలకు పంపారు. ఆ విధంగా భృగువు మొదట బ్రహ్మలోకం, తర్వాత శివలోకం తర్వాత వైకుంతానికి వెళ్లాడు. అక్కడ విష్ణువు తనను గమనించలేదన్న కోపంతో విష్ణువు వక్షఃస్థలంపై విసురుగా కాలితో తన్నాడు. ఐనా, విష్ణువు అతణ్ణి పూజించి తరించాడు. తన అజ్ఞానానికి చింతించి విష్ణుమూర్తియే సత్త్వగుణప్రధానుడని ఆయనకే ఆ యజ్ఞఫలాన్నివ్వాలని నిర్ణయించి వెళ్లిపోయాడు. శ్రీమహాలక్ష్మి విష్ణువు వక్షఃస్థలంపై తనను తన్నాడని కోపించి అలిగి వైకుంతాన్ని వదలి వెళ్లిపోయింది. అలా వెళ్ళిపోయిన ఆమెను వెతుక్కుంటూ స్వామి శేషాచలాన్ని చేరుకున్నాడు. అక్కడ లక్ష్మీదేవికొరకు సువర్ణముఖీనదికి దక్షిణాన ఒక సరోవరాన్ని త్రవ్వాడు. అందు పద్మాలను పూయించే తోటను వేశాడు. ఆ పద్మాల వికాసనానికి సూర్యనారాయణుని ప్రతిష్ఠించాడు. అలా పంద్రెండుసంవత్సరాలు ఘోరతపస్సు చేశాడు.

ఆ తపస్సుకు లక్ష్మి కార్తికమాసంలో, శుక్లపక్షంనందు, పంచమీతిథినాడు, శుక్రవారం, ఉత్తరాషాఢనక్షత్రమందు, పద్మసరోవర మధ్యభాగంలో వేయిరేకులతోనున్న సువర్ణపద్మంలో కూర్చొని, చేతుల్లో పద్మాల్ని ధరించి, పద్మమువంటి విశాలమైన కన్నులతో, ఎఱ్ఱని పద్మాలవంటి పాదాలతో సకలాభరణాలు ధరించి, సుగంధద్రవ్యాలతో చేర్చిన చందనంతో కూడిన ముఖవర్చస్సుతో శోభాయమానమైన సుగంధపుష్పాలు ధరించి, తన స్వామికి దర్శనమిచ్చింది.



అలా తన లక్ష్మిని తిరిగి శాశ్వతంగా పొందటానికి కారణమైన పద్మసరోవరానికి స్వామి ఈ విధంగా వరమిచ్చాడు. దీన్ని ఈనాటినుండీ 'పద్మవాసీ', 'పద్మం', 'పద్మసరస్సు' అని పిలుస్తారు. నీవు 'పద్మావతి' (అలర్‌మేల్‌మంగ) అను పేరుతో ప్రసిద్ధి చెందుతావు. ఇక్కడే స్థిరనివాసం కల్గిఉండుమంటూ వరమిచ్చాడు.

అలాంటి ఈ పద్మసరోవరాన సాక్షాత్తు శ్రీమన్మహాలక్ష్మి శ్రీమహావిష్ణుప్రార్థనతో ఆవిర్భవించింది.

ప్రతి సంవత్సరం కార్తికశుక్లపంచమినాడు శ్రీమహాలక్ష్మికి మహోత్సవం జరుగుతుంది. ఇది పంచమీతిథినాడు కార్తికమాసంలో జరుగుతుంది.

ఈ కార్తికశుద్ధపంచమిని అవభృథదినంగా ఎంచి నవరాత్రులఉత్సవం జరిగేట్లు బ్రహ్మోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ బ్రహ్మోత్సవం కార్తికమాస కృష్ణపక్ష ఏకాదశినగానీ లేదా ద్వాదశినగానీ అంకురార్పణతో ప్రారంభిస్తారు.

సర్వసామాన్యంగా బ్రహ్మోత్సవాలు అన్ని దేవాలయాల్లో రథోత్సవంతో పూర్తయ్యేట్లు చేస్తారు. తీర్థవారికి (అవభృథ స్నానం) అంత ప్రాముఖ్యత, ప్రాధాన్యము ఉండదు. ఐతే, తిరుచానూరులో మాత్రం శ్రీపద్మావతిఅమ్మవారికి ఈ అవభృథ స్నానం (తీర్థవారి) ఒక ప్రత్యేకతను సంతరించుకున్నది. దీనికే పంచమీతీర్థమని పేరు. ఈ పంచమీతీర్థమహోత్సవం ఎంతో వైభవంగా జరుగుతుంది. భృగుమహర్షి కారణంగా వేరైన లక్ష్మీ నారాయణులు తిరిగీ కలుసుకున్న శుభదినం కాబట్టి పంచమీ తీర్థమహోత్సవం అంత గొప్పగా ప్రఖ్యాతి గాంచింది. ఇలాంటి ఉత్సవం ఒక్క తిరుచానూరులో ఉన్న పద్మావతిఅమ్మవారికి తప్ప మరెక్కడా జరగదు.

ఈ రోజున తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామివారు పెండ్లికుమారునిగ కన్పిస్తాడు. తిరుచానూరులోని పద్మావతి అమ్మవారు పెండ్లికుమార్తెగా కన్పిస్తుంది.

పంచమీతీర్థానికి ముందురోజు తిరుమలలో శ్రీవారి ఆలయంలో అధ్యయనోత్సవాల్లో 'రాపత్తు' చివరిదినం. ఈ ఉత్సవం పూర్తై ఏకాంతసేవ జరిగి తిరిగి మరుదినము అనగా పంచమీతిథిరోజున స్వామివారికి సుప్రభాత, తోమాల అర్చనలు జరిపి అమ్మవారికి పంపదగిన పసుపు, తులసి, పీతాంబరమును శ్రీస్వామివారికి సమర్పిస్తారు.

శ్రీవేంకటేశ్వరస్వామి స్వయాన శ్రీపద్మావతిఅమ్మవారికి భర్త కదా! తన భర్త స్వయాన భార్య అయిన తనకు, తాను అవతరించినవేళ పసుపు, పట్టువస్త్రాలు పంపడమంటే తన మాంగల్యానికి మంగళకరము కదా! మాంగల్యం ఉన్న ప్రతి పుణ్యస్త్రీ కోరుకునే కోరికదే కదా!

శ్రీవేంకటేశ్వరస్వామి స్వయంగా పంపే పసుపు, తులసి, పీతాంబర పట్టువస్త్రాలు, ప్రసాదాలు ఛత్రచామరాలతో, మేళతాళాలతో, ఆలయమర్యాదలతో అర్చకులు, జియ్యర్లు, ఏకాంగులు, అధ్యాపకులు, ఆచార్యపురుషులు, అధికారులు, ఊడిగందారులు వేదపారాయణంతో తిరువీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్తారు. తిరిగీ ఏకాంగులు పై సామగ్రిని తమ నెత్తిన పెట్టుకొని కాలిబాటన



నడుస్తూ తిరుపతివద్ద అలిపిరి చేరుకుంటారు. ఆ పసుపు, తులసి, పీతాంబరము ఇత్యాది వస్తుసామగ్రిని ఏనుగుపై ఏకాంగి నెక్కించి ఊరేగింపుగా తిరుచానూరుమార్గంమీదుగా తిరుచానూరు పొలిమేరలో ఉన్న పసుపు మంటపానికి చేరుకుంటారు.



ఆలోగా తిరుచానూరులో శ్రీపద్మావతిఅమ్మవారికి పల్లకీఉత్సవం తిరువీథుల్లో జరుగుతుంది. ఆలయంలో యథావిధిగా అర్చనాదికార్యక్రమాలు, చూర్ణాభిషేకం జరుగుతాయి.

ఆ పైన అమ్మవారి దేవాలయాధికారులు, అర్చకులు, ఊరిపెద్దలు పసుపుమంటపానికి చేరుకుని తిరుపతినుండి ఏనుగుపై వచ్చిన సంభారములకు ఎదురెళ్ళి, తాము తెచ్చిన అరటిపళ్ళను ఏనుగుకు పెట్టి, ఆ పై ఊరేగింపుతో తిరుచానూరులోని తిరువీథులగుండా శ్రీ అమ్మవారిదేవాలయసన్నిధిని చేరుకుంటారు.

ఆపైన పద్మావతిఅమ్మవారు, చక్రత్తాళ్వార్లు ఊరేగింపుగా పద్మసరోవరానికి చేరుకుంటారు. పంచమీతీర్థమండపానికి చేరుకున్న అమ్మవారికి, చక్రత్తాళ్వార్లకు తిరుమంజనం ప్రారంభిస్తారు. జియ్యంగార్లు స్నపనసామగ్రిని అందిస్తూండగా దేవాలయఅర్చకులు స్నపనము గావిస్తారు. వేదపారాయణందార్లు శ్రీసూక్తం, పురుషసూక్తం మొదలైన పంచసూక్తాలను; తైత్తిరీయ, నారాయణ ఉపనిషత్తులను గానం చేస్తారు.

ఈ స్నపనం పూర్తికాగానే అర్చకులు శ్రీచక్రత్తాళ్వారులను తీసుకొని పద్మసరోవరంలో చక్రస్నానం గావిస్తారు. అదే సమయంలో భక్తులు కూడ పద్మసరోవరంలో మునుగుతారు. ఈ స్నానం పరమపుణ్యప్రదమైనది. పాపాల్ని హరిస్తుంది. సర్వరోగనివారణం చేస్తుంది. శుభాలను చేకూరుస్తుంది. సంపదలను చేకూరుస్తుంది.

ఈ పద్మసరోవరంలో స్నానమాచరించినవారికి ఏడు జన్మలపాపాలు హరించుకుపోతాయి. నిర్మలులుగా ఉంటారు. లక్ష్మీసంపన్నులౌతారు. రాజ్యభ్రష్టులైనవారు నలభైరోజులు ఈ సరస్సులో ఇంద్రియనిగ్రహంతో స్నానం చేసినట్లైతే తిరిగీ రాజ్యలక్ష్మిని పొందుతారు. ఈ సరోవరంలో స్నానంచేసి లక్ష్మీదేవిని స్తుతించినవారు ఐశ్వర్యము, ఆయుష్షు, దివ్యతేజోవంతము, పుత్రప్రాప్తి, ఇహలోకభోగాలు అనుభవిస్తారు. మోక్షాన్ని కూడా పొందుతారు. ఈ సరోవరాన్ని స్తుతించినాగానీ, స్నానమాచరించినాగానీ భూలోకవాసులపాపాలు హరించిపోతాయి. సంపదలు కల్గుతాయి.

చక్రస్నానానంతరం జియ్యంగార్లు ప్రబంధపారాయణం గావిస్తారు. అర్చకులు శ్రీస్వామివారినుండి అమ్మవారికి సమర్పించిన పసుపు, తులసిని అధికారులకు, భక్తులకు పంచిపెడతారు. ఈ ఒక్కరోజు మాత్రమే శ్రీవారి తులసి భక్తులకు పంచబడుతుంది. సంవత్సరంలో ఈ రోజు తప్ప మరి ఏ రోజూ శ్రీవారి తులసి దొరకడం కష్టమే.

ఆ తర్వాత అమ్మవారిని పద్మసరోవరానికి ఎదురుగా ఉన్న గంగుండ్రమంటపంవద్దకు చేర్చి సాయంత్రం అమ్మవారిని విశేషవస్త్రాభరణాలతో, పుష్పాలతో అత్యంతవైభవంగా అలంకరించి నైవేద్యం పెట్టి, ఆస్థానం జరిపి తిరువీథులగుండా దేవాలయం జేరుకుని ధ్వజావరోహణంతో ఉత్సవాన్ని పూర్తి చేస్తారు.

ఆనాడు శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువై ఉన్న తిరుమల దేవాలయాన్ని వీడి స్వయంగా తిరుచానూరుకు చేరుకుని, పద్మావతిఅమ్మవారితో కలిసుంటారని ఐతిహ్యం.

పూర్వము పంచమీతీర్థంనాడు చక్రస్నానం జరిగేంత వరకు తిరుమలలో శ్రీస్వామివారిదేవాలయం కూడ మూసేసేవారట. ఇది అనాదిగా సంప్రదాయంగా ఉండేది. ప్రస్తుతం ఇలాంటి ఆచారం ఆచరణలో లేదని పెద్దలమాట.



ధారావాహిక


# హరిదాస వాఙ్మయంలో... శ్రీవేంకటాచలాధీశుడు

- శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు

*గత సంచిక తరువాయి భాగం...*

## కనకదాసుల కృతులలో వేంకటేశ్వర ప్రశస్తి (ప్రస్తావన)

"కాగినెలె యాదికేశవ" అంకితంచే కన్నడంలో అనేక కీర్తనలను, 'మోహనతరంగిణి', 'నళచరిత్ర', 'హరిభక్తిసార' అను గ్రంథాలను రచించిన కనకదాసులవారు వ్యాసరాయలవారి దివ్యబోధనలచే హరిదాస శ్రేష్ఠులైనారు. యమాంశసంభూతు డని ఆప్తవాక్యప్రమాణంవల్ల తెలుస్తోంది. (తా జంభారియే కనకను - మధ్వపతి విఠలదాసు) ఇతని కీర్తనలను ముండిగెగళు అని అంటారు. 'నమ్మమ్మ శారదె ఉమామహేశ్వరి', 'ఇష్టుదిన ఈ వైకుంఠ ఎష్టు దూరవో' 'ఏసు కాయంగళ నళిదు ఎంభత్తు నాల్కులక్ష జీవరాసియన్ను' 'ముట్ట బేడముట్టబెడ' 'పరమ పురుష నీ నెల్లికాయి' 'భజిసి బదుకెలో మానవ', 'తల్లణి సదిరుకాంద్య తాళుమనలె'- మొదలైనవి కనకదాసులవారి ప్రసిద్ధకృతులు. కనకదాసులవారిని స్వయంగా శ్రీనివాసుడు తన బ్రహ్మోత్సవా లకు రమ్మని కలలో పిలిచాడని ఐతిహ్యం. శ్రీనివాసుని సూచనానుసారం కనకదాసుని గౌరవంగా ఆహ్వానించుటకు నాటి (మహంతు) దేవస్థానపు అధికారులు కొండదిగి ఈతనికెదురుగా రాగా ఆతనిని గుర్తించలేక నీవెవరని అడిగితే 'ముందు పోయే వాళ్ళకు వెనుక, వెనుక వచ్చేవాళ్ళకు ముందర' అని అన్నాడట. నిరాడంబరుడు, నిగర్వి, ఉదారమనస్కుడైన ఇతడు దేవుని స్మరిస్తూ కొండపైకి వచ్చి చలికి వణుకుతూ ఆకలిని భరించలేక ఒకచోట చీకటిలో పరుండినప్పుడు ఆ చీకటిలో ఒక ఆజానుబాహుడు ప్రసాదాన్ని, కప్పుకోవటానికి జరీవస్త్రాన్ని ఇచ్చి వెళ్లాడట. కనకదాసులవారి భక్తికి మెచ్చిన ఉడుపి కృష్ణుడు పశ్చిమాభిముఖుడయ్యాడనే ఐతిహ్యమున్నది. ఈ మహానుభావునిచే శ్రీనివాసునికి పాడిన లాలిపాట ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈ పాటను దేవాలయాల్లో రాత్రి పవళింపు సేవసమయంలో ఎక్కువగా పాడుతుంటారు. ఐదుచరణాలు గలిగిన ఈ లాలిపాట పల్లవి



"లాలి పావన చరణ లాలి అఘహరణ ।
లాలి వేంకట రమణలలిత కళ్యాణ ॥

నరమృగాకారి హిరణ్య కనవైరి ।
కరిరాజ రక్షక కారుణ్యమూర్తి ।
హరి ఆది కేశవ గురు అప్రమేయ ।
సిరిధర శేషగిరి వర తిమ్మరాయ ॥

కనకదాసు రచించిన కృతులలో వ్యాజనిందాస్తుతికి చెందిన 'బందె వయ్య గోవింద శెట్టి' అనె పాటకూడ ప్రసిద్ధమే. 'ఏనెందు కొండాడి స్తుతి సలోదేవ' అను కీర్తనలో 'తిరుపతియ వాస శ్రీవేంకటేశను నీను స్మరిసి నిన్నయనామ బదుకువనునాను। బిరుదుళ్ళవను నిను మోరె హోక్కవనునాను। సిరియాది కేశవనె నీను.' (ఏమని పొగడుదు నిన్ను. తిరుపతిపురవాసుడైన శ్రీవేంకటేశు డవు నీవు. నిన్ను స్మరించి బ్రదికేవాడను నేను) అని అంటారు.

'ముట్టబేడ' అను కీర్తనలో 'సిరి రామ మంత్ర సదా జపి సుత మోదదలి। తిరుపతి యాత్రెయ మాడువ మాహాత్మర ముట్టబేడ' రామమంత్రజపం, తిరుపతియాత్రను చేసేవారిని ముట్టకండని యముడాజ్ఞాపించాడని అంటాడు. **(ఇంకా ఉంది)**



ధైర్యమే వ్యక్తి స్వభావానికి చిహ్నం



# భక్తి ఎంత మధురం!

– డా॥ మాడభూషి జ్యోతికుమారి, 99490 31174



సర్వమయుడగు భగవంతునియందుగల అపారమైన ప్రేమభక్తి అని నిర్వచించి, పరమాత్మయందుగల అనన్యభక్తి అమృతస్వరూపమైనది అంటాడు నారదుడు. ఇదే మధురభక్తి. లోకంలో స్త్రీ పురుషుల ప్రేమ లౌకికం. భగవంతునికి, భక్తునకు మధ్యగల ప్రేమ అలౌకికం, అమృతస్వరూపం. ఇదే మధుర భక్తికి బీజం.

మధురభక్తిమార్గంలో భగవంతుని సేవించి తరించిన తరుణి, దివ్యాంశసంభూత గోదాదేవి. ఈమెకు ఆండాళ్, కోదై, శూడికొడుత్త మ్మాళ్, ఆముక్తమాల్యద అనే నామాంతరాలున్నాయి. ఈమె భూదేవి అంశ అని పురాణవచనం. విష్ణుచిత్తుడు (పెరియాళ్వార్) ఒకనాడు తులసివనంలో ఉండి మొక్కలకు పాదులు చేస్తున్నాడు. నాగలితో నేలను దున్నుతున్న జనకచక్రవర్తికి సీతాదేవి లభించినట్టుగా తులసి వనంలో ఒక బాలిక కన్పించింది. కర్కటకమాసంలో, పుబ్బా నక్షత్రంలో కన్పించిన ఆ బాలికను గ్రహించి తన భార్యకు ఇచ్చాడు. ఆమెకు 'కోదై' అని నామకరణం చేశాడు. సొంతబిడ్డకంటే అపురూపంగా ఆ దంపతులు ఆమెను పెంచసాగారు. అలా ఆమె పెరిగి పెద్దదైంది.

ఓ రోజు రాత్రి స్వామి విష్ణుచిత్తునికలలో సాక్షాత్కరించి గోదా ధరించిన మాలలు తనకు అత్యంత ప్రీతికరమని, ఆమె ధరించి ఇచ్చిన మాలలే నేను ధరిస్తానని చెప్పాడు. విష్ణుచిత్తుడు తన కుమార్తె స్వామి కొరకు పుట్టిన కారణజన్మురాలిగ భావించాడు. ఆనాటినుండి గోదా దేవికి 'ఆముక్తమాల్యద' అని పేరు కల్గింది.

గోదాదేవిలోని భగవద్భక్తి భగవద్రతిగా మారింది. శ్రీకృష్ణునే పరమాగతిగా, పరమాశ్రయంగా, పరమశరణ్యునిగ భావించి, బుద్ధితో, మనస్సుతో, తనువుతో సర్వవిధాలుగ, సర్వదా తనను తాను శ్రీకృష్ణచరణ కమలములందు సమర్పించుకొని విరహితురాలయింది.


మధురభక్తిరసానికి గోదాదేవిలోని కృష్ణరతి స్థాయిభావం. శ్రీకృష్ణుని గుణాలు, చేష్టలు. లీలలు ఉద్దీపనవిభావాలు. గోదాదేవి శ్రీకృష్ణవిరహాన్ని భరించలేక చెలికత్తెలతో 'ఓ చెలులారా! ఆ కృష్ణావతారంలో మనముంటే ఎలా ఉండేదో' అని గాఢంగా నిట్టూర్చింది. ఆ మాటలకు చెలులు

గృహలక్ష్మి

ఆమెతో ఆనాడు నీవు కృష్ణునితోనే ఉన్నావు అనగా గోదాదేవి ఆశ్చర్యపడి 'నా పూర్వవృత్తాంతం చెప్పండి' అంది. అప్పుడు చెలికత్తెలు 'భామినీ! నీవు అప్పుడు సత్యభామవు' అన్నారు. వెంటనే ఆమెకు పూర్వజన్మజ్ఞానం కల్గింది. ఆమెకు శ్రీకృష్ణునితో కలిసి తాను చేసిన విహారాలన్నీ గుర్తుకొచ్చాయి.

గోదాదేవి కృష్ణవిరహాన్ని సహించలేక వారితో 'శ్రీకృష్ణునకు అప్పుడు అత్యంత ప్రియురాలినై ఈ కలిలో జన్మించటమే పాపం. పైగా విరహవేదనలో మాడిపోతూ, బ్రతుకుతూ తండ్రిగారు నన్నొకనికిచ్చి వివాహం చేయకముందే ఈ శరీరాన్ని యోగశక్తితో దగ్ధం చేసుకోవడం ఉత్తమం. తర్వాత మరలా స్వామి పాదాలచెంతను చేరి సేవించుకోవచ్చు' అని అంటున్న ఈమెలో చనిపోవాలనే కాంక్ష కల్గడం మధురభక్తికి పరాకాష్ఠ.

మధురభక్తిమార్గంలో తన్నుతాను సమర్పించుకున్నది గోదాదేవి. మధురభక్తి రసమార్గంలో తన్నుతాను ఆత్మార్పణం ద్వారా భగవత్ప్రాప్తిని పొందాలనే తహతహ ఆమె మాటలలో కన్పిస్తుంది.



కాలస్వరూపుడైన శ్రీకృష్ణుడు ఆమెలోని భగవద్రతి అనే స్థాయిభావానికి భావనోద్దీపనం కల్గిస్తున్నాడు. ఆమెకు అన్ని కాలాలు విరహోద్దీపన సామగ్రిగానే భాసిస్తున్నాయి. గోదాదేవికి శ్రీకృష్ణునిపై గల వలపు సామాన్యమైనది కాదు. ఈమె విరహ భావనలోని తీవ్రత, ఉదాత్తత ప్రస్ఫుటంగా ప్రకటించబడటమే కాదు. మధురభక్తిరసానికి ఉద్దీపన కల్గించి స్థాయిభావమైన భగవద్రతిరసంగా పరిణామం చెందుతుంది. శ్రీకృష్ణుని చేరుకోవాలని గోదాదేవిలోని ప్రేమభావనే మధురభక్తికి పరాకాష్ఠ.

గోపాంగనవలె శ్రీకృష్ణునియందు అనురాగబద్ధయైన గోదాదేవి అంతరంగంలో భగవంతునిలో ఐక్యమును వాంఛించింది. విష్ణుచిత్తుడు కూడా గోదాదేవికి చిన్నప్పటినుండి విష్ణుభక్తి ప్రబోధకములైన కథలే చెప్తూండేవాడు. గోపికలు శ్రీకృష్ణుని భర్తగా పొందగోరి కాత్యాయనీవ్రతాన్ని చేశారని తండ్రిచెప్పగా విని గోదాదేవి శ్రీరంగనాథుని భర్తగా పొందగోరి ధనుర్మాస వ్రతం సంకల్పించింది. రోజుకు ఒక్కపాశురంచొప్పున ముప్పది పాశురాలు రచించి శ్రీకృష్ణుని సేవించింది. అదే **'తిరుప్పావై'**గా ప్రసిద్ధి చెందిన ద్రావిడప్రబంధం. ఆమె రచించిన పాశురాలలో కూడా మధురభక్తి ద్యోతకమౌతుంది.

శ్రీకృష్ణవిరహంవల్ల రేయింబవళ్లు విరహవేదనాభారంతో బాధపడింది. పరితపించింది. ఆ బాధకు విముక్తి శ్రీకృష్ణభగవానుని కటాక్షవీక్షణాలే. ఇందులో మధురభక్తికి ఆలంబన శ్రీకృష్ణుడు. గోదాదేవి కృష్ణునిప్రేమను కోరే గోపిక. ఆ గోపిక బాధ, వ్యధ గోదాదేవిదే. తన మనస్సులోని భావాలకు రూపం గోపిక వ్యాజంగా వ్యక్తీకరించింది. గోదాదేవిలో సంపూర్ణతత్త్వ జ్ఞానం ఆత్మానుభూతి, పరిపూర్ణ ఏకాంతబోధ, దివ్యప్రేమ సర్వము మధురభక్తిరూపంలో మిళితమైపోయాయి.

శ్రీవిల్లిపుత్తూరు ఐన తన స్వగ్రామంలో విష్ణుచిత్తుడు గోదాదేవికి శ్రీరంగనాథునితో కల్యాణం జరిపించాడు. గోదాదేవి ఉజ్జ్వలమైన తన మధురభక్తితో స్వామితో సాయుజ్యం పొందింది. తన సౌందర్యాన్ని, కన్నెవలపును మధురభక్తితో రంగరించి శ్రీరంగనాథునకు కర్పూరహారతిగ నివేదించిన మధురభక్తి ప్రణయిని గోదాదేవి.



ప్రేమ ఉన్నచోట జీవితముంటుంది. పగ ఉన్నచోట నాశనం ఉంటుంది

# శమీవృక్షం పూజయామి!!

- శ్రీ యస్. తులసీరామ్

ప్రజాపతి సమస్తాన్ని సృష్టించినట్లే అందులో భాగంగా అగ్నిని కూడ సృష్టించాడు. అగ్నిని సృష్టించగానే అది తన ప్రభావాన్ని చూపించసాగింది. తనను సృష్టించిన ప్రజాపతినే కాల్చసాగింది. దాంతో భయపడిన అతను పచ్చని చెట్టుకొమ్మలతో దానిని కొట్టి ఆర్పివేయగలిగాడు. అలా అగ్నిని శమింపచేయడానికి ఉపయోగపడిన ఆ వృక్షము శమీవృక్షమైంది. ఈ కథ మైత్రీయసంహిత, శతపథబ్రాహ్మణం, కథకసంహిత, కపిస్థలకథాసంహితలలో ఉంది.

ఈ శమీవృక్షం అన్నిరకాల చెడుప్రభావాలను తొలగద్రోసి శుభాలను కలిగిస్తుంది. ప్రశాంతతను చేకూరుస్తుంది. శరీరంలోని అధికవృష్ణాన్ని తగ్గిస్తుంది. జఠరాగ్నిని రగిల్చి జీర్ణశక్తిని వృద్ధిపరుస్తుంది. హిందువులు దీనిని పవిత్రచెట్టుగా పూజిస్తారు.

మన సనాతనధర్మంలో వృక్షాలకు చాలా ప్రాధాన్యత ఉంది. చాలా వృక్షాలు దేవతాసంబంధమైనవిగా ఉన్నాయి. శమీవృక్షం (జమ్మిచెట్టు) – పాండవులు ఆయుధాలను భద్రపరచగా వాటిని కాపాడి వారికి ఒప్పగించి పూజలందుకొంటున్న మహావృక్షం.

### శమీవృక్షం: (జమ్మిచెట్టు)

శమీవృక్షానికి ఆధ్యాత్మికంగా చాలా ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా, దేవీనవరాత్రోత్సవాల్లో (దసరాఉత్సవాల్లో) శమీపూజకు చాలా ప్రాధాన్యం ఉంది. పంచ పత్రములలో (తులసి, బిల్వము, రుద్రజడ, శమీపత్రం, మాచీపత్రం) శమీపత్రం ఒకటి.

దేవి నవరాత్రోత్సవాలు ఆశ్వయుజమాసం మొదటిరోజయిన పాడ్యమి రోజునుండి తొమ్మిదిరోజులపాటు జరుగుతాయి. పదవరోజయిన దశమిరోజున విజయదశమిగా పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. ఈ దసరాపూజల్లో శ్రీదేవీ పూజ, కుమారీపూజ, ఆయుధపూజలతోపాటు శమీపూజకూడా చాలా ప్రాధాన్యతను సంతరించుకుంది. విజయదశమి పూజల్లో శమీవృక్షాన్ని పూజించడానికి గల కారణం పాండవులకు సంబంధించింది.

పాండవులు అరణ్యవాసం పూర్తిచేసి అజ్ఞాతవాసానికై విరాటనగరానికి వెళుతూ తమను ఎవరూ గుర్తుపట్టకుండా ఉండడంకోసం వారు తమ ఆయుధాలన్నీ ఒక కట్టగా కట్టి దానిని ఒక గుడ్డలో పెట్టి చుట్టి బయటకు కనబడకుండా చుట్టి గట్టిగా కట్టి ఆమోపునెత్తుకొని ధర్మరాజు ఆ మార్గంలో ఉన్న ఒక శమీవృక్షాన్ని ఎక్కి దేవతలను ప్రార్థించాడు.

బ్రహ్మనూ, ఈశ్వరుడినీ, విష్ణువునూ, దిక్పాలకులనూ, చంద్రుడినీ, సూర్యుడినీ, వనదేవతలనూ, పితృదేవతలనూ స్తుతించాడు. భూమ్యాకాశాలనూ ప్రార్థించాడు. తదుపరి ఆ శమీవృక్షంలో ఒక పెద్దకొమ్మకు ఆ ఆయుధాలమోపును గట్టిగా కట్టినాడు. ఆ ఆయుధాల అధిదేవతలకు నమస్కరించి, "అర్జునుడికీ, నాకూ తప్ప ఇతరులకు మీ ఉనికిని చూపించకండి.



ఇతరులకు మీరు విషసర్పాలవలె కనపడండి. మీ ఆకారం భయంకరంగా ఉండాలి. ఇది నా ప్రార్థన." అని ప్రార్థించి ధర్మరాజు చెట్టు దిగాడు. ఆ చెట్టుకు ప్రదక్షిణం చేశాడు.


ఆవిధంగా పాండవులు తమ ఆయుధాలను కట్టగట్టి శమీవృక్షంమీద ఉంచి వాటిని కాపాడే బాధ్యతను ఆ శమీతరు చక్రవర్తికి ఒప్పగించారు. వారు అజ్ఞాతవాసానికై విరాటనగరానికి వెళ్ళారు.

ఆ శమీవృక్షం ఆ ఆయుధాలను ఎంతో భద్రంగా కాపాడింది. ఆమార్గంగుండా వెళ్ళే బాటసారులు, పశువులకాపర్లు ఆ వృక్షంవైపు చూసినప్పుడు ఆ ఆయుధాలమోపు వారికంటికి ఒక శవంలా కనిపించేటట్లు చేసింది ఆ శమీవృక్షం. దానివల్ల ఎవ్వరూ ఆ వృక్షసమీపానికి వెళ్ళే సాహసం కూడా చెయ్యలేదు.

అలాగే సంవత్సరకాలంపాటు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉన్నా ఆ ఆయుధాలు తుప్పుపట్టకుండా, కాంతి తగ్గకుండా, పదును తగ్గకుండా ఉండేలా వాటిని కాపాడింది ఆ శమీవృక్షం. అలా సంవత్సరకాలం కాపాడి తదుపరి ఉత్తర గోగ్రహణసమయంలో కౌరవులతో పోరాడుటకై ఆయుధాల కోసం అర్జునుడు వచ్చినప్పుడు అతనికి ఆనాడు తాము ఉంచిన ఆయుధాలమోపుగానే కనపడి ఆయుధాలను అతనికి ఒప్పగించింది. ఆ ఆయుధాలతోనే పాండవులు కురుక్షేత్రంలో కౌరవులతో పోరాడి వారి పదకొండు అక్షౌహిణీలసైన్యాన్ని పరిమార్చి అఖండవిజయాన్ని సాధించారు. పాండవులు ఆ ఆయుధాలను ఆ శమీవృక్షంపై భద్రపరచిందీ, తిరిగి తీసుకున్నదీ ఆశ్వయుజమాసం శుక్లదశమిరోజు. అదే శ్రీదేవిమాత మహిషాసురునిపై విజయం పొందిన రోజు విజయదశమి పర్వదినం.

అందువల్ల విజయదశమిరోజున శమీవృక్షాన్ని పూజించే ఆచారం ఏర్పడింది. ఆ రోజున శమీవృక్షాన్ని పూజిస్తే తమకూ, తమ ఆయుధాలకు (తమ వృత్తిసాధనాలకు) భద్రత ఉంటుంది. తాము చేసే పనుల్లో తమకు సత్ఫలితాలు అందుతాయి. శత్రుభయం, రోగభయం ఉండదు అన్న నమ్మకంతో ఆరోజున శమీవృక్షాన్ని పూజిస్తారు. సమీపంలో శమీవృక్షం ఉంటే శమీవృక్షాన్నే పూజిస్తారు. దగ్గరలో ఆవృక్షం లేనివారు ఎక్కడైనా ఆ వృక్షం వద్దకు వెళ్ళి ఓ చిన్నకొమ్మను తీసుకొచ్చి ఆ కొమ్మను పూజిస్తారు.

అలాగే గణేశచతుర్థినాడు గణపతిపూజల్లో భాగంగా చేసే ఏకవింశతిపత్రపూజలో "శమీపత్రం పూజయామి" అంటూ గణేశుని శమీపత్రంతో అర్చిస్తాం.



ఈవిధంగా శమీవృక్షానికి దైవసంబంధమూ ఉంది. దైవారాధనల్లో ప్రాధాన్యతా ఉంది. ఆ విధంగా దివ్యత్వం పొంది లోకంలో పూజలందుకొంటూ ఉంది శమీవృక్షం. శమీవృక్ష ప్రాముఖ్యతను తెలుసుకొని మనం కూడా శమీవృక్షాన్ని పూజించి సత్ఫలితాలను పొందుదాం. శమీవృక్షంతో పాటు అన్ని వృక్షాలనూ కాపాడుదాం.

"వృక్షో రక్షతి రక్షితః"





# మనసులోని కోరికను తీర్చే దేవదేవుడు

- శ్రీ భాస్కరభట్ల బాలసుబ్రహ్మణ్యంశర్మ,
99482 54947

మేము గత 20సం॥లనుండి ప్రతి సంవత్సరం తప్పకుండా శ్రీవారిని దర్శించుకునేందుకు తిరుమలకొండకు వస్తున్నాం. కాని నాకు ఊహ తెలిసినప్పటినుండి తిరుమల గిరులనుండి వర్షాలకారణంగా జాలువారే వరదనీటిని, ఆ కనువిందైన సోయగాలను ప్రత్యక్షంగా చూడాలనే కోరిక గత 20సం॥లనుండి అలానే ఉండిపోయి ఎన్నడూ తీరలేదు. కాని, తేది. 15-5-2017 రోజున మా కుటుంబసభ్యులతో కలిసి మా స్వస్థలమైన నల్లగొండ (తెలంగాణ) పట్టణంనుండి తిరుమలకొండకు చేరుకొన్నాం. అది మే నెల నడి ఎండాకాలం అవడంవల్ల సుమారు 45డిగ్రీల ఉష్ణోగ్రతతో విపరీతమైన ఎండ ఉండి, చాలా వేడి వాతావరణం ఉన్నది. కాని, నా మనసులో గల బాధను స్వామివారు పసిగట్టినట్లుగా, యాదృచ్ఛికంగా, అనూహ్యంగా సాయంత్రం కాగానే నల్లనిమేఘాలు కమ్ముకొని, వాతావరణం పూర్తిగా చల్లగా మారిపోయింది. మేము స్వామివారిని దర్శించుకొని రెండురోజులు తిరుమలకొండపైననే ఉన్నాం. మేము ఉన్న రెండు రోజులు అనగా తేది. 16-5-2017 మరియు తేది. 17-5-2017 రెండురోజులు భారీవర్షాలు కురిశాయి. స్వామివారిని దర్శించుకొన్న పిదప తేది. 18-5-2017 నాడు ఆర్.టి.సి. బస్సులో తిరుమలనుండి తిరుపతికి బయలుదేరాం. కొండమీద నుండి తిరుపతికి చేరేంతవరకు భారీవర్షం పడుతూనే ఉన్నది.

ఘాట్‌రోడ్లవల్ల నాకు బస్సుప్రయాణం పడకపోవడం వల్ల నాకు ఎప్పుడూ వికారంగా ఉండి, వాంతులు అవుతూనే ఉంటాయి. మరి అదేమి విచిత్రమో ఏమో కాని నాకు ఆరోజు ఎటువంటి వాంతులు, వికారాలు కలుగలేదు. అందువల్ల కొండ మీద బండరాళ్ళనుండి జాలువారే వర్షపునీటివరదను కళ్ళారా చూసే భాగ్యం కలిగింది. మరియు కొండదిగిన తరువాత మేము కపిలతీర్థం వెళ్ళి కొండలపైనుండి భారీవర్షాలవల్ల క్రిందికి జాలువారే వరదను కళ్ళారా చూశాను.



శ్రీవారిని భక్తిశ్రద్ధలతో, మనసారా తలిస్తే, పూజిస్తే, కొలిస్తే మన మనసులోని బాధను కూడా గమనించి ఆ కొండల రాయడు తప్పక తీరుస్తాడు అనేది నిత్యసత్యం.

శ్రీవారిజన్మనక్షత్రమైన "శ్రవణానక్షత్రం" రోజున భక్తిశ్రద్ధలతో నా శక్తికొలది వ్రతం జరుపుకుంటూ వస్తున్నాను. ఈ వ్రతం చేయకముందు నాలో ప్రతినిత్యం ఏదో తెలియని బాధ, నిరాశ, నిస్పృహలు, ఇంటిలో చికాకులు, తగాదాలు, ఆర్థికఇబ్బందులు ఉండేవి. మరి శ్రీవారి మహిమవలన నేను ప్రస్తుతం సుఖసంతోషాలతో నాకు ఉన్నంతలో సంతృప్తిగా ఉన్నాను. శ్రీవారిని మనస్ఫూర్తిగా, నీతినియమాలతో, భక్తిశ్రద్ధలతో పూజిస్తే స్వామివారు అనుక్షణం మనకు తోడుగా ఉంటాడనడంలో ఎటువంటి సందేహం లేదు.

*ఓం నమో వేంకటేశాయ!!*

# సూర్యమండలం లేకపోతే



# భూమండలం లేదు!!

– శ్రీమతి యస్. రమ్య

**మానవాళి జీవితంలో సంఖ్యలపాత్ర చాలా కీలకమైనది అన్నది నిర్వివాదాంశం. అలాగే ఆధ్యాత్మికంలోనూ సంఖ్యలకు విశేషప్రాముఖ్యత ఉన్నది. ఒక్కో విషయంలో ఒక్కో సంఖ్య ప్రాధాన్యత వహిస్తుంది. ప్రతి సంఖ్యకు కొన్ని విశేషాలు ముడిపడి ఉన్నాయి. వీటిలో ద్వాదశసంఖ్యను గురించి తెలుసుకుందాం....**

## ద్వాదశాదిత్యులు

సర్వదేహులకూ ఆత్ముడు విష్ణుభగవానుడు. అనాదియైన అతడి మాయతోనే సూర్యమండలం తయారయ్యి లోకంలో తిరుగుతూ ఉంది. లోకాల అధికర్త శ్రీహరియే సూర్యుడు. శ్రీమన్నారాయణస్వరూపుడైన సూర్యుడు ఒక్కడే అయినా ఋషులు బహురూపాలతో వర్ణించారతణ్ణి. భగవంతుడు ఒక్కడే. అతడే మాయాశక్తితో కాలమూ, దేశమూ మొదలగు తొమ్మిది రూపాలుగా మారుతున్నాడు. వీటిలో కాలరూపుడు సూర్యుడు. కాలరూపుడైన సూర్యుడు లోకతంత్రం సరిగ్గా సాగడంకోసం పన్నెండుమాసాల్లో వేర్వేరు గణాలతో పరిభ్రమిస్తున్నాడు. ఆ క్రమంలో ఒక్కోమాసంలో సూర్యుడు ఒక్కొక్కపేరుతో కీర్తించ బడుతున్నాడు.

ఒక్కొక్కమాసంలో ఒక అప్సరస, ఒక రాక్షసుడు, ఒక సర్పము, ఒక యక్షుడు, ఒక ఋషి, ఒక గంధర్వుడు – వీరందరూ సూర్యునికి గణాలుగా ఉంటారు. వీరు ప్రతిమాసానికి మారిపోతూ ఉంటారు. అలాగే ప్రతిమాసంలో సూర్యునిపేరు కూడా మారుతూ ఉంటుంది. ఆ వివరాలను చూద్దాం.

**01) చైత్రమాసం:** చైత్రమాసంలో సూర్యునిపేరు ధాత. ఈ మాసంలో సూర్యగణంలో ఉండే అప్సరస– కృతస్థలి, రాక్షసుడు– హేతి, సర్పం– వాసుకి, యక్షుడు రథకృత్తు, ఋషి– పులస్త్యుడు, గంధర్వుడు – తుంబురుడు.

**02) వైశాఖమాసం:** సూర్యుని పేరు ఆర్యముడు. అప్సరస– పుంజికస్థలి, రాక్షసుడు– ప్రహేతి, సర్పం– కచ్ఛనీరం, యక్షుడు– అమౌజుడు, ఋషి– పులహుడు, గంధర్వుడు– నారదుడు.

**03) జ్యేష్ఠమాసం:** సూర్యునిపేరు– మిత్రుడు. అప్సరస– మేనక, రాక్షసుడు– పౌరుషేయుడు, సర్పం– తక్షకుడు, యక్షుడు– రథస్వంతుడు, ఋషి– అత్రి, గంధర్వుడు– హాహా.

**04) ఆషాఢమాసం:** సూర్యునిపేరు– వరుణుడు. అప్సరస– రంభ, రాక్షసుడు–చిత్రస్వంతుడు, సర్పం–శుక్రం, యక్షుడు– సహజన్యుడు, ఋషి–వసిష్ఠుడు, గంధర్వుడు–హూ హూ.

**05) శ్రావణమాసం:** సూర్యునిపేరు– ఇంద్రుడు. అప్సరస– ప్రమోచ, రాక్షసుడు– వర్యుడు, సర్పం– ఏలాపుత్రుడు,

యక్షుడు- శ్రోతుడు, ఋషి- అంగిరుడు, గంధర్వుడు- విశ్వావసుడు.

**06) భాద్రపదమాసం:** సూర్యునిపేరు- వివస్వంతుడు. అప్సరస- అనుమ్లుచ, రాక్షసుడు- వ్యాఘ్రుడు, సర్పం- శంఖపాలుడు, యక్షుడు- ఆసారణుడు, ఋషి- భృగుడు, గంధర్వుడు- ఉగ్రసేనుడు.

**07) ఆశ్వయుజమాసం:** సూర్యునిపేరు- త్వష్ట. అప్సరస- తిలోత్తమ, రాక్షసుడు- బ్రహ్మోపేతుడు, సర్పం- కంబళ్యుడు, యక్షుడు- శతజిత్తు, ఋషి- జమదగ్ని, గంధర్వుడు- ధృతరాష్ట్రుడు.

**08) కార్తికమాసం:** సూర్యునిపేరు- విష్ణువు. అప్సరస- రంభ, రాక్షసుడు- మఖాపేతుడు, సర్పం- అశ్వతరుడు, యక్షుడు- సత్యజిత్తు, ఋషి- విశ్వామిత్రుడు, గంధర్వుడు- సూర్యవర్చుడు.

**09) మార్గశిరమాసం:** సూర్యునిపేరు- అంశుడు. అప్సరస- ఊర్వశి, రాక్షసుడు- విద్యుచ్ఛత్రుడు, సర్పం- మహాశంఖుడు, యక్షుడు- తార్‌క్ష్యుడు. ఋషి- కశ్యపుడు, గంధర్వుడు- రుతసేనుడు.

**10) పుష్యమాసం:** సూర్యునిపేరు- భగుడు. అప్సరస- పూర్వాచిత్తి, రాక్షసుడు-స్ఫూర్జుడు, సర్పం-కర్కోటకుడు, యక్షుడు- ఉర్ణుడు, ఋషి- ఆయుపు, గంధర్వుడు- అరిష్టనేమి.



**11) మాఘమాసం:** సూర్యునిపేరు- పూషుడు. అప్సరస- ఘృతాచి, రాక్షసుడు- వాతుడు, సర్పం- ధనంజయుడు, యక్షుడు- సురుచి, ఋషి- గౌతముడు, గంధర్వుడు- సుషేణుడు.

**12) ఫాల్గుణమాసం:** సూర్యునిపేరు- పర్జన్యుడు. అప్సరస- సేనజిత్తి, రాక్షసుడు- వర్చుడు, సర్పం- ఏరావతుడు, యక్షుడు- క్రతుడు, ఋషి- భరద్వాజుడు, గంధర్వుడు- విశ్వుడు.

ఈవిధంగా సూర్యుడు ఒక్కోమాసంలో ఒక్కోగణంతో కలిసి పరిభ్రమిస్తూ ఉంటాడు. ఒక్కోమాసంలో ఒక్కోపేరుతో కీర్తించబడుతూ ఉంటాడు.

విష్ణురూపుడైన సూర్యభగవానుడి విభూతులే సూర్యగణాలు. ప్రతిరోజు ఉదయమూ, సాయంకాలమూ వీటిని స్మరిస్తే సకలపాపాలు నశిస్తాయి.

సూర్యుడు నెలనెలా తన గణాలతో కలసి లోకసంచారం చేస్తూ ఇహపరాల విజ్ఞానం వెలిగిస్తూ ఉంటాడు.

సూర్యగణాలలోని ఋషులు ఋగ్యజుస్సామవేదాలలోని సూర్యమంత్రాలతో అతణ్ణి స్తోత్రం చేస్తారు. గంధర్వులు అతడికీర్తిని గానం చేస్తారు. అప్సరసలు అతని ఎదుట నడుస్తూ నాట్యం చేస్తారు. సర్పాలు తాళ్ళయ్యి అతడి రథాన్ని లాగుతారు. యక్షులు రథాన్ని ముస్తాబు చేస్తారు. రాక్షసులు వెనుకనుంచి రథాన్ని తోస్తారు. ఈ విధంగా ఒక్కొక్కరు ఒక్కొక్క బాధ్యతను నిర్వర్తిస్తూ సూర్యభగవానుడికి సేవ చేస్తారు సూర్యగణాలు.

ఇంతేగాక అరవైవేల వాలఖిల్యులు, బ్రహ్మఋషులు, నిర్మలస్వభావులు సూర్యుడి రథంముందు నడుస్తూ సూర్యుడిని స్తోత్రం చేస్తూ ఉంటారు. వీరందరూ సూర్యభగవానుడివైపే ముఖం పెట్టుకుని నడుస్తారు.

అనాదినిధనుడైన భగవంతుడు శ్రీహరియే కల్పకల్పంలోనూ ఇలా పన్నెండువ్యూహాలతో లోకాన్ని పాలిస్తున్నాడు.

ఈ ద్వాదశాదిత్యనామాలతో ప్రతిరోజూ సూర్యుని ఆరాధించి సూర్యుని అనుగ్రహాన్ని పొందుదాం. ఆయురారోగ్యైశ్వర్యానందాలను పొందుదాం.

మాటలతో నీ శక్తిని వృథా చేయకు. నిశ్శబ్దంగా ధ్యానం చెయ్యి

## ఆయుర్వేదం

# ఆరోగ్యప్రసాదగుళికలు 'శనగలు'

- డా।। చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

*భారతీయ వైదికక్రతువుల్లో, కర్మల్లో, క్రియల్లో నవధాన్యాలను ఉపయోగించటం కద్దు. ఈ నవధాన్యాలను నవగ్రహాలకు ప్రీతిపాత్రంగా భావిస్తారు. నవధాన్యాల్లో ఒకటైన శనగలు బృహస్పతిగ్రహానికి ప్రీతిపాత్రం. పోషక, ఔషధ ప్రాధాన్యత కలిగి ఉన్న శనగలను సంస్కృతంలో "చణక" అని వ్యవహరిస్తారు. ఆంగ్లంలో "బెంగాల్‌గ్రామ్", హిందీలో "చణేకా బీజ్"గా పిలవబడే ఈ శనగలు పాపిలియోనేసి వృక్ష కుటుంబానికి చెందినవి. వీటి శాస్త్రీయనామం "సైసర్ ఎరీటినమ్". ఈ శనగలను ఎలాంటివ్యాధులకు ఔషధంగా వాడవచ్చో తెలుసుకుందాం..*

**మొటిమలకు :** శనగపిండిలో తగినంత నిమ్మరసం, పాలు చేర్చి పేస్టులా చేసి ముఖానికి పట్టించి గంటసేపు ఆగి కడిగేస్తే మొటిమలు తగ్గి చర్మం మృదువుగా, కాంతివంతంగా తయారవుతుంది.

**చుండ్రుకి :** వారంలో 2సార్లు 100గ్రాముల పెరుగులో 10 గ్రాముల శనగపిండి, 5గ్రాముల మెంతిపిండి కలిపి 2-3 గంటలు నానించి మాడుపై లేపనం చేసి మర్దించి గంటసేపు ఆగి తలస్నానం చేస్తూంటే చుండ్రు బాగా అదుపులో ఉంటుంది.

**అధిక ఋతుస్రావం:** శనగలను కొద్దిగా వేయించి చేసిన చూర్ణం 25గ్రాములు, పంచదార 25గ్రాములు, జీలకర్రను వేయించి చేసిన చూర్ణం 2-3 గ్రాములు కలిపి రోజుకు ఒకసారి సేవిస్తూంటే మహిళలను ఇబ్బందులకు గురిచేసే ఈ సమస్య త్వరగా తగ్గిపోతుంది.

**అవాంఛితరోమాలసమస్యకి:** రోజుకు ఒకసారి 30గ్రాముల శనగపిండిలో 5గ్రాముల స్వచ్ఛమైన పసుపుపొడి కలిపి ఉంచుకొని 1 లేదా 2సార్లు తగినంతపొడిలో తగినన్ని పాలు, పన్నీరు (రోజ్‌వాటర్) చేర్చి పేస్టులా చేసి పైన లేపనం చేసి గంటసేపు ఆగి కడిగేస్తూండాలి.

**వ్యాధినిరోధకశక్తి పెరిగేందుకు:** రోజూ రాత్రిపూట 100మి.లీ. నీటిలో 20-30 శనగలు, 5-6 కిస్‌మిస్‌లు వేసి ఉదయం ఆ పదార్థాలను తిని మిగిలిన నీరు త్రాగుచుంటే శరీరపుష్టి, బలము, శరీరదారుఢ్యం, మానసిక, శారీరకఅలసట కలుగకుండ ఉండటమేకాక వ్యాధినిరోధకశక్తి పెరిగి చీటికిమాటికి వ్యాధులు మనదరి చేరకుండా ఉంటాయి. హృద్రోగులకు కూడా మంచిది.



**మంగుమచ్చలకి:** వారానికి రెండుసార్లు తగినంత శనగపిండిలో నీరు కలపకుండా తీసిన ఉల్లిపాయరసం తగినంత కలిపి పేస్టులా చేసి పైన లేపనం చేసి 15నిమిషాలు ఆగి కడిగేస్తుండాలి.

**పార్శ్వపుతలనొప్పి:** రాత్రి పడుకునేటపుడు 100గ్రాముల శనగలను ఒక మట్టిపాత్రలో వేసి మునిగేంతవరకు నీరు పోసి ఉదయం మెత్తగా నలిపి తగినంత నెయ్యివేసి వేయించి 50గ్రాముల పటికబెల్లంపొడి కలిపి దంచి పరగడుపున తింటుంటే అతిత్వరగా ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. ఇలా వారం పదిరోజులు చేయాలి.

**ముఖం సౌందర్యవంతంగా అయ్యేందుకు:** శనగలు, ధనియాలు, జీలకర్ర, మెంతులు, అతిమధురంచూర్ణాలను సమానంగా కలిపి ఉంచుకొని వారంలో 2-3 సార్లు జిడ్డుచర్మం కలవారు నిమ్మరసం కలిపిన నీటితోను, పొడిచర్మం కలవారు పాలు లేదా మీగడతోను, సాధారణచర్మం కలవారు రోజ్‌వాటర్ తోను కలిపి పేస్టులా చేసి ముఖానికి పట్టించి గంటసేపు ఆగి కడిగేస్తుండాలి.

**జీర్ణక్రియ సరిగ్గా జరిగేందుకు :** రోజు రాత్రి పడుకునేటప్పుడు పిడికెడు శనగలను తగినన్ని నీటిలో వేసి ఉదయం శనగలను వేరుచేసి వాటికి కొద్దిగా శొంఠిపొడి, జీలకర్రపొడి కలిపి సేవిస్తుండాలి. ఇందువల్ల మలబద్ధకం కూడా దరిచేరదు. ఈ ఔషధ సేవనంవల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గి మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది.

# సంస్కృతం నేర్చుకుందాం..!!

పాఠం-12

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య    నిర్వహణ- మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| पाकः | = | వంట | कथम् | = | ఎట్లు? | अकरोत् | = | చేసెను |
| नमस्कारः | = | నమస్కారము | एवम् | = | ఇట్లు | अकरोः | = | చేసితివి |
| व्यापारः | = | వ్యాపారము | इत्थम् | = | ఇట్లు | अकरवम् | = | చేసితిని |

అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?

01) ब्राह्मणः स्नानं अकरोत्।
02) अहं पाकं करोमि।
03) त्वं स्नानं अकरोः।
04) बालकाः नमस्कारं कुर्वन्ति।
05) अहं नमस्कारान् अकरवम्।
06) के व्यापारं कुर्वन्ति?
07) त्वम् एकं व्यापारं अकरोः खलु!
08) त्वं कथं स्नानं अकरोः?
09) इत्थं अकरवम्।
10) अहो! यूयं अद्यैव स्नानं कुरुथ किम्?

అ) జవాబులు

01) బ్రాహ్మణుడు స్నానము చేసెను.
02) నేను పాకమును చేయుచున్నాను.
03) నీవు స్నానము చేసితివి.
04) బాలకులు నమస్కారము చేయుచున్నారు.
05) నేను నమస్కారములను చేసితిని.
06) ఎవరు వ్యాపారమును చేయుచున్నారు?
07) నీవు ఒక వ్యాపారమును చేసితివి కదా!
08) నీవు ఎట్లు స్నానము చేసితివి?
09) ఇట్లు చేసితిని.
10) ఓహో! మీరు ఈ రోజే స్నానము చేయుచున్నారా ఏమి?


ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) మేము నమస్కారములను చేయుట లేదు.
02) నీవు నమస్కారములను చేసినావా?
03) పిల్ల లట్లు నమస్కారములను చేయుచున్నా రేమి?
04) ఏమో వారు పిల్లలుకదా.
05) మీరు పిల్లలు కారా?
06) మేమును పిల్లలమే.
07) రేపు వంట యెట్లు?
08) దేవుడే యున్నాడు.
09) ఈ రాత్రి భోజన మెట్లు?
10) నేను ప్రొద్దుననే భోజనము చేసితిని.

ఆ) జవాబులు

01) वयं नमस्कारान् न कुर्मः।
02) किं त्वं नमस्कारान् अकरोः?
03) किमर्थं बालाः तथा नमस्कारान् कुर्वन्ति?
04) किं वा ते बालाः एव किल।
05) यूयं बालाः न किम्।
06) वयमपि बालाः एव।
07) श्वः पाकः कथम्?
08) देवः एव अस्ति।
09) अद्य रात्रौ भोजनं कथम्?
10) अहं प्रातः एव भोजनं अकरवम्।

విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



# ఉన్నవాడు-ఉపకారబుద్ధి

పుట్టు బిత్తలివలె; పోవు బిత్తలివలె;
తిరుగు బిత్తలివలె దేహి ధరణి
ఉన్ననాటి కైన నుపకారి గాలేడు;
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** బిత్తలి= ఒంటిమీద బట్ట లేకుండుట; దేహి= మనిషి; ఉన్ననాటికి= సంపద ఉన్నప్పుడు; ఉపకారి= మేలు చేసేవాడు.

**భావం:** మనిషి ఏమీ లేకుండానే ఈలోకంలోకి వస్తాడు. లోకం విడిచివెళ్లేటపుడు కూడ ఏమీ లేకుండానే, తనదంటూ తీసుకువెళ్లకుండానే వెళ్లిపోతాడు. ఈ లోకంలో ఉన్నరోజుల్లో ఐనా ఎవరికీ ఉప కారమూ చెయ్యడు.

**వివరణ:** వేమన ఈపద్యంలో 'బిత్తలి' పదం ఉపయోగించాడు. రాయలసీమలోనే ఈపదాన్ని ఉపయోగిస్తారు. జీవుడు ఈలోకంలో దేహిగా (దేహం కలవాడు) దిసమొలతో పుడతాడు. అంటే కేవలం శరీరంతో వస్తాడు. ఈలోకం విడిచిపోయేటప్పుడు కూడ దిగంబరుడుగానే కేవలం దేహంతోనే పోతాడు. మధ్యలో జీవించిఉన్నకాలంలో ఎంతో పోగుచేసుకుంటాడు. తాను ఎలా వచ్చాడో, ఎలా పోతాడో తెలిసి కూడా నడుమ తనకున్నంతలో ఇతరులకు సాయం చేయాలనుకోడు. మానవుడు తప్పకుండా అవసరంలో ఉన్నవారికి చేతనయిన ఉపకారం చేయాలనేదే వేమన ఉపదేశం.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

# 71 వైకుంఠపాళి

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | ■ | 4 | ■ | 5 |
| | ■ | | ■ | | ■ | | ■ | |
| 6 | | ■ | 7 | | | ■ | 8 | |
| | ■ | 9 | ■ | | ■ | 10 | ■ | |
| | ■ | 11 | | ■ | 12 | | | ■ |
| | ■ | | ■ | 13 | ■ | | ■ | 14 |
| ■ | 15 | ■ | 16 | | | ■ | 17 | |
| ■ | | ■ | ■ | | ■ | 18 | ■ | |
| 19 | | | | | ■ | 20 | | |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

## అడ్డం

2)అలివేలుమంగాపురానికి మరోపేరు(5); 6)ఇది ఇంద్ర లోహకము(2); 7)వేంకటేశ్వరుని జన్మనక్షత్రం(3); 8)బలము(2); 11)ఇక్ష్వాకుకుమార్తెయైన సువర్ణకొడుకు(2); 12)మణిపురాన్ని పాలించే గంధర్వుడు(3); 16)తెలుగు సంవత్సరం(3); 17)మయుని భార్య(2); 19)ఆకాశరాజు ఇంటికి వచ్చిన ఎరుకలసాని(5); 20)రాజు(3)

## నిలువు

1)చిఱుతొండని భార్య(6); 2)వెన్నెల(2); 3)అర్జునుని సారథియైన రుక్మికూతురు(4); 4)మేరువు కుమార్తె(2); 5)తుంబురుని వీణ(4); 9)విశ్వావసుని వీణ(3); 10)పాండవులకు మయసభను నిర్మించిన వాడు(3); 13)శివునికంటిమంటకు బూడిదయైనవాడు(4); 14)అదితికశ్యపులకు జన్మించిన కుమారుడు(4); 15)పార్వతి(3); 18)భూమి(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



ధ్యానాన్ని ఒక పనిగా చేయకు; ప్రతి పనిని ఒక ధ్యానంగా చెయ్యి

బాలనీతి

# మనిషై పుట్టాక...

- శ్రీమతి రావూరి రమాదేవి,
96521 16371

నారాయణదంపతులు పొలంపనికి వెళ్లొస్తూ, పిడుగుపడి హఠాత్తుగా చనిపోయారు. పిల్లలిద్దరూ ఇంటిబాధ్యత పట్టకుండా తిరిగారు ఇంతకాలం. ఒకేసారి కుటుంబబాధ్యత మీద పడడంతో, వ్యవసాయం అలవాటు లేక కాళ్లీడ్చుకుంటూ భారంగా పొలంవైపు వెళ్లసాగారు. దారిలో వారికో సాధువు ఎదురయ్యాడు. 'నాయన లారా! ఎందుకు అంతదిగాలుగా ఉన్నారు?' అనడిగాడు ప్రేమగా.

తమ తల్లిదండ్రులు మరణించిన విషయం చెప్పి, ఒళ్లు వంచడమంటే, బహుకష్టంగా ఉంది అన్నారు. "తప్పదు నాయనా. మనిషై పుట్టాక, ఏదో ఒక పనిచేసి, పెళ్లాం పిల్లల్ని పోషించా ల్సిందే! మీరు కష్టపడి పని చేయండి. దైవం మీకు తోడుగా ఉంటాడు". అని నేలమీదకు వంగి, గుప్పెడుమట్టి చేతిలోకి తీసుకున్నాడు. ఇరువురిచేతుల్లోనూ సగం సగం ఉంచి, దీన్ని "మీ పంటపొలంలో చల్లండి. మీకు అంతా శుభమే జరుగు తుంది. కానీ, ఒక్కమాట. దానం, ధర్మం మాత్రం మరిచి పోకండి" అని చెప్పి వెళ్లిపోయాడు.

అన్నదమ్ములిద్దరూ ఆ మట్టిని తమ భూమిలో చల్లు కున్నారు. తండ్రికున్న పదెకరాల్లో చెరి ఐదెకరాలు గెట్టు పెట్టు కుని వ్యవసాయం మొదలుపెట్టారు.

అదేం చిత్రమో కానీ, ఏ పంట వేసినా పుష్కలంగా పండసాగింది. పెద్దవాడు పంపయ్య, రెండోవాడు దుర్గయ్య తమ తమ భార్యలతో పొలంలోకి వచ్చి, పగలనకా, రాత్రనకా కష్టపడి పనిచేయసాగారు. పండిన పంటకు దండిగా డబ్బు రాసాగింది.

పంపయ్య ఆ డబ్బుతో భూమికొని, మరింత భూమితో వ్యవసాయం చేయసాగాడు. పైసా దానం చేసేవాడు గాదు. పైగా సోమరిపోతులను పోషించడమంటే, దేశానికి భారం పెంచుతున్నట్లే అని బిచ్చగాళ్లను, సాధువులను ఎగతాళి చేసేవాడు.


దుర్గయ్య ముందే ఒక నియమం పెట్టుకున్నాడు. తనకు ఎంత ఆదాయం వస్తే, అందులో పదవవంతు దానం చేయడానికి, ధర్మకార్యాలకు ఉపయోగించాలని. సాధువులను, సన్యాసుల్ని ఆదరించడం- సత్రాలు కట్టించడం, పాఠశాలలకు విరాళా లివ్వడం లాంటివి చెయ్యసాగాడు.

ఆరేళ్లలో పంపయ్య సంపద రెట్టింపైంది. దుర్గయ్య అదే జీవితాన్ని కొనసాగిస్తూ, గ్రామంలో మంచివాడుగా పేరు తెచ్చుకున్నాడు.

ఒకనాడు దంపతులు ఒక అమ్మాయిని వెంటబెట్టుకుని పంపయ్య ఇంటికి వచ్చారు. "అయ్యా, బీదరికంలో ఉన్నాం. మా కూతురికి పెళ్లి చేయాలి. ఏదైనా సాయం చేయండి" అని వేడుకున్నారు. ఏమి ఇచ్చేది లేదన్నాడు పంపయ్య. తర్వాత దుర్గయ్య ఇంటికి వెళ్లి, తమ బాధను చెప్పుకున్నారు దంపతులు. అన్నం పెట్టి, తన వంతుగా తాళిబొట్టు కొనిపెట్టి పంపించాడు. దంపతులు దీవించి వెళ్లారు.

అలా తమ్ముడికి మంచిపేరు రావడం చూసి తట్టుకోలేని అన్న ఓ అర్ధరాత్రి రహస్యంగా వెళ్లి, దుర్గయ్య పంటపొలానికి నిప్పు పెట్టాడు. అప్పుడే చీకట్లో విషసర్పం కాటేసింది. తమ్ముడే తీసుకెళ్లి వైద్యం చేయించి తీసుకొచ్చాడు. పంపయ్య నిప్పు పెట్టగానే, పంపయ్య పొలానికి పక్కనున్న రైతులపొలాలకు కూడా అంటుకుని పంటంతా కాలిపోయింది. రైతులు కోపించి పంపయ్యమీదికొచ్చారు. అప్పుడు పంపయ్య- "తానే తమ్ముడి మీది ఈర్ష్యతో నిప్పుపెట్టానని, తనను మన్నించమని" దుర్గయ్యను, రైతులను వేడుకున్నాడు.


అప్పుడు దుర్గయ్య మనమంతా మనుషులం కాబట్టి తప్పు చేస్తాం. క్షమించడం దైవికలక్షణం. మొదటితప్పుగా క్షమించి వదిలేయండి. మళ్లీ ఇటువంటి తప్పు చేయడు అని గ్రామస్తులంద రినీ వేడుకున్నాడు. పంటను తగలబెట్టి, తను సర్వనాశనమై పోవాలని చూసినా- అన్నను క్షమించిన తమ్ముడి ఔదార్యానికి జనం నమోవాకాలు అర్పించారు. అప్పుడు మొదలు పంపయ్య బుద్ధి తెచ్చుకుని, గ్రామస్తులందరితోనూ సఖ్యంగా ఉంటూ- దానధర్మాలు చేస్తూ మంచివాడని పేరు తెచ్చుకున్నాడు.



చిత్ర కథ

# తిరుప్పావై

కథ– డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు– కె.తులసీప్రసాద్




17
ఓ గోవిందా! నీ దయాదృష్టితో మా పాపాల్ని తొలగించు.
ఎందరినో అలా అనుగ్రహించావు కదా!
18
గోవిందా! మాధవా!
19
సింహంలా నడచి రా! శరణాగతి పొందాం! మమ్మల్ని ఆదరించు.
20
దుష్టుల్ని చంపిన నీ వీరచరితాన్ని గానం చెయ్యటం మా అదృష్టం
21
స్వామీ! మాకు చిల్లరకోరికలు లేవు. నీతో కలిసి హాయిగా పాయసాన్ని ఆరగిస్తాం.
22
మేం ఎప్పుడూ నీతోనే ఉండాలి. నీ సేవలోనే తరించాలి స్వామీ!
23
మన బంధం విడదీయరానిది. మనకి భేదం లేదు. గోవిందా!
24
శ్రీవ్రతం పూర్తయింది. ఆండాళ్ కోరిక తీరింది. ఆమె శ్రీరంగనాథుణ్ణి చేరుకొంది!
సర్వే జనాః సుఖినో భవన్తు!

# బాలవినోదం

పిల్లలూ... మీ మేధకు పదును పెట్టండి....

నిర్వహణ: కుమారి పి. ఉషాలక్ష్మి

## కదంబం

### ద్వాదశ జ్యోతిర్లింగాలు

01) శ్రీసోమనాథేశ్వర జ్యోతిర్లింగం
02) శ్రీశైలమల్లికార్జున జ్యోతిర్లింగం
03) శ్రీమహాకాళేశ్వర జ్యోతిర్లింగం
04) శ్రీఓంకారేశ్వర జ్యోతిర్లింగం
05) శ్రీవైద్యనాథేశ్వర జ్యోతిర్లింగం
06) శ్రీభీమశంకర జ్యోతిర్లింగం
07) శ్రీరామలింగేశ్వర జ్యోతిర్లింగం
08) శ్రీనాగేశ్వర జ్యోతిర్లింగం
09) శ్రీకాశీవిశ్వేశ్వర జ్యోతిర్లింగం
10) శ్రీత్రయంబకేశ్వర జ్యోతిర్లింగం
11) శ్రీకేదారేశ్వర జ్యోతిర్లింగం
12) శ్రీఘృష్ణేశ్వర జ్యోతిర్లింగం

### పిల్లలూ..జతచేయండి!!

| | |
|---|---|
| 1) ఉత్తరాదేవి | అ) దుర్యోధనుని తల్లి |
| 2) సత్యవతీదేవి | ఆ) పార్థుని తల్లి |
| 3) కుంతీదేవి | ఇ) ఘటోత్కచుని తల్లి |
| 4) హిడింబాదేవి | ఈ) వేదవ్యాసుని తల్లి |
| 5) గాంధారీదేవి | ఉ) పరీక్షితుని తల్లి |

జవాబులు: 1-(ఉ); 2-(ఈ); 3-(ఆ); 4-(ఇ); 5-(అ)



### మీకు తెలుసా?

1) భీష్ముని అసలు పేరేమిటి?
2) అజ్ఞాతవాసంలో నకులుని పేరేమిటి?
3) శత్రుఘ్నుని భార్య ఎవరు?
4) విభీషణుని కుమార్తె ఎవరు?
5) వసుదేవుని మొదటిభార్య ఎవరు?
6) గజేంద్రుని పట్టుకున్నదెవరు?
7) ప్రహ్లాదుని తండ్రి ఎవరు?

**జవాబులు:**
1) దేవవ్రతుడు
2) దామగ్రంథి
3) శ్రుతకీర్తి
4) త్రిజట
5) రోహిణి
6) మొసలి
7) హిరణ్యకశిపుడు

### కనుక్కోండి

ఈ అక్షరాలతో ఒక సూక్తి వస్తుంది...

భ వం డి న్న క్తు మి
న్న దే భ క తు గ

**జవాబు:**
భగవంతుడికన్న
భక్తుడే మిన్న

### చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...

Printed by **Sri P.Ramaraju,** M.A., and Published by **Dr. K.Radharamana,** M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. **Editor: Dr.V.G.Chokkalingam,** M.A., Ph.D.



11-11-2021న
తిరుమలలో జరిగిన శ్రీవారి పుష్పయాగం



2021, నవంబరు 4న
తిరుమల శ్రీవారిఆలయంలో జరిగిన దీపావళి ఆస్థానం




20-10-2021న జరిగిన
తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి అన్నాభిషేకం



2021, అక్టోబరు 31 నుండి నవంబరు 2వ తేది వరకు జరిగిన
శ్రీనివాసమంగాపురం, శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలు





13-11-2021న తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారిని దర్శించుకున్న
కేంద్రహోంశాఖామాత్యులు మాన్యశ్రీ అమిత్‌షా,
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమాన్య ముఖ్యమంత్రివర్యులు శ్రీ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరియు తి.తి.దే. ఉన్నతాధికారులు

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-11-2021 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.



శ్రీ గోదాదేవి